E KABURU - Digital News Paper
E-PAPER
# ఈ-కబురు
ఎల్లప్పుడూ విశ్వసనీయ సమాచారం
@ekaburu.com
హైదరాబాద్ (తేదీ) 14-03-2026 (వారం) శనివారం సంపుటి: 02 || సంచిక:71 || పేజీలు–6
www.ekaburu.com



## వంటగ్యాస్ కష్టాలకు చెక్

రంగంలోకి రాష్ట్ర స్థాయి కమిటీ
ఎల్పీజీ సరఫరాపై నిరంతర నిఘా

....(మిగతా2లో)

దివాలా కంపెనీకి రూ.2,500 కోట్ల పనులు

## అమిత్ షాకు కేటీఆర్ సంచలన లేఖ



ఈ కబురు, హైదరాబాద్ :
తెలంగాణలో దిగజారుతున్న శాంతిభద్రతలు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి బినామీ ఆర్థిక లావాదేవీలపై బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షాకు ఫిర్యాదు చేశారు. కేఎల్ఎస్ఆర్ (KLSR) ఇన్‌ఫ్రాటెక్ అనే సంస్థకు అక్రమంగా కాంట్రాక్టులు కట్టబెట్టడంపై సీబీఐ, ఈడీ, ఎస్ఎఫ్ఐఓ వంటి కేంద్ర సంస్థలతో విచారణ జరిపించాలని కోరారు. దివాలా ప్రక్రియలో ఉన్న కంపెనీకి నిబంధనలకు విరుద్ధంగా రూ. 2,500 కోట్ల విలువైన సాగునీటి తాగునీటి ప్రాజెక్టులతో పాటు యంగ్ ఇండియా స్కూల్ పనులను అప్పగించారని లేఖలో ఆరోపించారు.

....(మిగతా2లో)

మూసీపై

# ప్రజెంటేషన్



**వందల ఏళ్ల కిందట ఆ రాజుకు ఉన్న సోయి.. నేటి మేధావులకు ఏమైంది?**

మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు..భవిష్యత్ తరాల కోసం చేపట్టిన బృహత్ కార్యం
చరిత్రలో నిలిచిపోయే పనులు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న..
బాపు ఘాట్‌కు కన్యాకుమారి తరహాలో అంతర్జాతీయ గుర్తింపు
గాంధీ విగ్రహం వంటి నిర్మాణాలకు కేవలం రూ. 250 కోట్లు మాత్రమే
అద్భుతమైన నగరాన్ని అందించడమే లక్ష్యం : సీఎం రేవంత్‌రెడ్డి

**ఈ కబురు, హైదరాబాద్:**

హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణాలో మూసీ పునరుజ్జీవన ప్రాజెక్టు పై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రజెంటేషన్ నిర్వహించారు. క్లైమేట్ చేంజ్ పరిశోధకులు, ఆర్థిక నిపుణులు, మేధావుల సమక్షంలో ఆయన మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టు కేవలం ఒక నిర్మాణం మాత్రమే కాదని, హైదరాబాద్ భవిష్యత్ తరాల కోసం చేపట్టిన బృహత్ కార్యాచరణ అని స్పష్టం చేశారు. అసంపూర్తి సమాచారంతో లేదా ఉద్దేశపూర్వకంగా అర్థ సత్యాలను ప్రచారం చేస్తూ ప్రజలను ఆందోళనకు గురిచేయడం సరికాదని ఆయన హితవు పలికారు. ప్రజలు తమపై ఉంచిన నమ్మకాన్ని కాపాడే కాపలాదారుగా మాత్రమే ఈ అధికారాన్ని వినియోగిస్తానని, ప్రజలపై ఆధిపత్యం చలాయించే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని పునరుద్ఘాటించారు. ప్రపంచ చరిత్రను ఒకసారి గమనిస్తే.. గొప్ప నాగరికతలన్నీ నదీ పరివాహక ప్రాంతాల్లోనే విలసిల్లాయని రేవంత్ రెడ్డి గుర్తు చేశారు. తాను స్వయంగా న్యూయార్క్‌లోని హడ్సన్ రివర్, లండన్, సింగపూర్, దుబాయ్ వంటి నగరాలను సందర్శించి అక్కడ నదీ తీరాల అభివృద్ధిని గమనించినట్లు తెలిపారు. ఇతర దేశాలు ఆర్థికంగా వేగంగా అభివృద్ధి చెందుతుంటే, మనం ఇంకా అభివృద్ధి నిరోధకులుగా మారి మౌనంగా ఉంటే భవిష్యత్ తరాలు మనల్ని క్షమించవని ఆయన హెచ్చరించారు. గత రెండు ఏళ్లుగా వందల గంటల పాటు నిపుణులు, ఆర్థిక, పర్యావరణ కన్సల్టెంట్లతో క్షుణ్ణంగా చర్చించిన తర్వాతే ఈ మూసీ ప్రాజెక్టును పట్టాలెక్కించినట్లు వివరించారు.

....(మిగతా2లో)



2

ఉమ్మడి ఏపీ మాజీ డీజీపీ

## హెచ్‌జే దొర కన్నుమూత

ఈ కబురు , హైదరాబాద్:
ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ డీజీపీ హెచ్‌జే దొర కన్నుమూశారు. గత కొంత కాలంగా ఆయన కిడ్నీ సమస్యతో బాధపడుతున్నారు. ఇవాళ ఉదయం డయాలసిస్ చేయించుకునేందుకు నిమ్స్‌కు వెళ్లారు.



2

సమ్మె నోటీసు ఇచ్చిన

## తెలంగాణ ఆర్టీసీ జేఏసీ

ఈ కబురు, హైదరాబాద్ ;
తెలంగాణ ఆర్టీసీ ఉద్యోగులు యాజమాన్యానికి సమ్మె నోటీసులు ఇచ్చారు. ఆర్టీసీని ప్రభుత్వంలో విలీనంలో చేయడంతో పాటు వివిధ డిమాండ్లపై కార్మికులు ఈ నోటీసు ఇచ్చారు. తమ డిమాండ్లపై ప్రభుత్వం స్పందించకపోతే సమ్మెకు వెళతామని హెచ్చరించారు.



3

పేదల ఇండ్లు కూలిస్తే

## సహించేది లేదు

ఈ కబురు, హైదరాబాద్ ;
మూసీ ప్రక్షాళన పేరిట పేదల ఇండ్లు కూలిస్తే సహించేది లేదని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు ఎన్. రాంచందర్ రావు హెచ్చరించారు. మూసీ ప్రాజెక్ట్‌పై తమ పార్టీకి వ్యతిరేకత లేదనీ, అయితే పేదల ఇళ్లు కూల్చడాన్ని వ్యతిరేకిస్తాం అని ఆయన శుక్రవారం విలేకరుల సమావేశంలో తెలిపారు.

# ఏపీలో సఖి నివాస్ పథకం

## ఏపీ క్యాబినెట్ ఆమోదం

**క్రష్ సదుపాయాలతో హాస్టళ్ళు**
**అమరావతిలో నిర్మాణాలు భూ కేటాయింపులకు గ్రీన్ సిగ్నల్**
**ఏపీఎస్పీలోని 300 మంది హెడ్ కానిస్టేబుల్ లకు పదోన్నతులు**
**ఉపాధి కల్పన కు సంబంధించి కొత్త పథకానికి ఆమోదం**



ఈ కబురు ;
ఏపీ కేబినెట్ పలు కీలక నిర్ణయాలు తీసుకుంది. అనేక ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. అమరావతి లో నిర్మాణాలు,భూ కేటాయింపులకు గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఏపీఎస్పీ లోని 2, 3, 5, 6, 9, 11, 14, 16వ బెటాలియన్లలో పనిచేస్తున్న 300 మంది హెడ్ కానిస్టేబుల్ పోస్టులను అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లుగా స్థాయిని పెంచడానికి మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఇరిగేషన్,రెవిన్యూ అంశాల పైన చర్చించిన మంత్రివర్గం పలు నిర్ణయాలకు ఆమోద ముద్ర వేసింది. ఉపాధి కల్పనకు సంబంధించి కొత్త పథకానికి ఆమోదం తెలిపారు.

....(మిగతా3లో)

తాగునీరు అందించేందుకు

## ప్రభుత్వం కృషి చేస్తోంది : మంత్రి సీతక్క



ఈ కబురు, హైదరాబాద్ :
ప్రతి ఇంటికి సురక్షితమైన తాగునీరు అందించేందుకు మేము అనేక ప్రతిపాదనలు కేంద్రానికి పంపాము అని మంత్రి సీతక్క పేర్కొన్నారు. జల్ జీవన్ మిషన్ పై రాష్ట్రాల మంత్రులతో కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్ శుక్రవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. కాన్ఫరెన్స్ లో సీతక్క పాల్గొని మాట్లాడుతూ.. సురక్షితమైన తాగునీరు లక్ష్యాన్ని సాధించేందుకు అవసరమైన నిధులు కేటాయించాలని కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. తాగునీటి సరఫరా వ్యవస్థలను స్థిరీకరించడం, దీర్ఘకాలం కొనసాగించేలా నిర్వహించడం అత్యంత అవసరం అన్నారు.

....(మిగతా2లో)




ఈసీ అభిశంసనకు

## విపక్షాల నోటీసులు

ఈ కబురు, దిల్లీ: ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (SIR) కసరత్తులో అధికార భాజపాకు అనుకూలంగా ఎన్నికల సంఘం పక్షపాతంగా వ్యవహరిస్తోందని విపక్షాలు ఆరోపిస్తున్న విషయం తెలిసిందే.

....(3లో)

కామాఖ్య - చర్లపల్లి 'అమృత్ భారత్'

## ఎక్స్ ప్రెస్ రైలు ప్రారంభం



**ఈ కబురు;**
**అసోం, రెండు తెలుగు రాష్ట్రాలను అనుసంధానించే అమృత్ భారత్ ఎక్స్‌ప్రెస్ రైలును ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రారంభించారు. ఈ రైలును ప్రధాని అసోంలో ప్రారంభించారు. అసోంలోని ప్రముఖ పుణ్యక్షేత్రం కామాఖ్య, చర్లపల్లి మధ్య స్లీపర్, జనరల్ సెకండ్ క్లాస్ కోచ్‌లతో ఈ రైలు సేవలు అందించనుంది.**

....(మిగతా3లో)

# పెను ముప్పు..నీటికి నిప్పు

## గల్ఫ్‌లో డీశాలినేషన్ ప్లాంట్లు లక్ష్యంగా దాడులు

ఈ కబురు ;
పర్షియన్ గల్ఫ్ ప్రాంతాన్ని క్షిపణులు, డ్రోన్లు ఉక్కిరిబిక్కిరి చేస్తుంటే.. చమురు ధరలపై పడే ప్రభావం గురించి అన్ని దేశాలు ఎక్కువగా ఆలోచిస్తున్నాయి. ప్రపంచంలోని ఐదో వంతు ముడిచమురు ఎగుమతి గల్ఫ్ ప్రాంతం నుంచి సాగడమే ఇందుకు కారణం. అయితే పశ్చిమాసియాలోని నగరాలకు తాగునీటిని సరఫరా చేసే మౌలికవసతులూ అదే స్థాయిలో ముప్పును ఎదుర్కొంటున్నాయి. దీనివల్ల లక్షల మంది దాహార్తితో అలమటించే పరిస్థితి ఉత్పన్నమవుతుందని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ప్రపంచంలోనే నీటి లభ్యత తక్కువగా ఉన్న ప్రాంతాల్లో పర్షియన్ గల్ఫ్ కూడా ఉంది.



....(మిగతా2లో)



భారత్ మా మిత్రదేశం

## ఇరాన్ రాయబారి

ఈ కబురు : హర్మూజ్ జలసంధి మీదుగా భారత జెండాలున్న నౌకలు వెళ్లేందుకు ఇరాన్ అనుమతించినట్లు ఇటీవల వార్తలు వచ్చిన విషయం తెలిసిందే. దీనిపై భారత్‌లోని ఇరాన్ రాయబారి మొహమ్మద్ ఫత్‌హలీ స్పందించారు.

....(3లో)

దేశంలో వరి ఉత్పత్తిలో

## మొదటి స్థానం తెలంగాణదే



ఈ కబురు : తెలంగాణ వ్యవసాయ ఉత్పత్తులు అంతర్జాతీయ మార్కెట్‌లో పోటీపడేలా గ్రేడింగ్, ప్రాసెసింగ్, ప్యాకేజింగ్, బ్రాండింగ్, నాణ్యతా ప్రమాణాలు మరింత బలోపేతం కావాల్సిన అవసరం ఉందని మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. శుక్రవారం హైదరాబాద్ రెడ్‌హిల్స్‌లో నిర్వహించిన ఓ సదస్సులో ఆయన మాట్లాడారు. దేశంలో వరి ఉత్పత్తిలో తెలంగాణ మొదటి స్థానంలో ఉందన్నారు.

....(మిగతా3లో)

రాజ్యాంగాన్ని రక్షించడమంటే ఇదేనా..?

## రాహుల్‌గాంధీకి హరీశ్‌రావు లేఖ



ఈ కబురు, హైదరాబాద్: పార్టీ ఫిరాయింపుల విషయంలో కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ వైఖరిపై మాజీ మంత్రి హరీశ్ రావు మండిపడ్డారు. ఈ అంశంపై రాహుల్‌గాంధీకి లేఖ రాశారు. "ప్రజాస్వామ్య వ్యవస్థలను కాపాడతామని మేనిఫెస్టోలో చెప్పారు.

....(మిగతా3లో)

తిరుమల కొండపై

## కొనసాగుతున్న భక్తుల రద్దీ



ఈ కబురు;
తిరుమలలో భక్తుల రద్దీ కొనసాగుతోంది. వివిధ ప్రాంతాల నుంచి వస్తున్న యాత్రికులతో తిరుమల గిరులు కిటకిటలాడుతున్నాయి. వైకుంఠం క్యూ కాంప్లెక్స్ భక్తులతో పూర్తిగా నిండిపోవడంతో, స్వామివారి దర్శనం కోసం క్యూలైన్లలో భక్తులు బారులు తీరారు.

....(మిగతా3లో)

## దివాలా కంపెనీకి రూ.2,500 కోట్ల పనులు .. అమిత్ షాకు కేటీఆర్ సంచలన లేఖ



ఈ కంపెనీ రేవంత్ రెడ్డికి బినామీ అని ఆయన వాడిన వాహనం ఈ సంస్థ పేరుతోనే రిజిస్టర్ అయిందని ఆధారాలను ప్రస్తావించారు. ముఖ్యమంత్రి తన బినామీ కంపెనీని కాపాడుకునేందుకు అధికారులపై ఒత్తిడి తెచ్చి సాక్ష్యాధారాలను తారుమారు చేయిస్తున్నారని కేటీఆర్ విమర్శించారు. సేకరించిన కీలక పత్రాలు మాయమయ్యాయని ప్రభుత్వ అధికారులు కోర్టులో చెప్పడం దారుణమని ధ్వజమెత్తారు. రాష్ట్రంలోని విచారణ సంస్థలను పోలీసు వ్యవస్థను నమ్మే పరిస్థితి లేదని సాక్ష్యాధారాలను ముఖ్యమంత్రి స్వయంగా మాయం చేయిస్తున్నారని ఆరోపించారు. నేషనల్ లా ట్రిబ్యునల్ (NCLT) విచారణలో కూడా రేవంత్ రెడ్డి జోక్యం చేసుకుంటున్నారని పక్షపాతం లేని విష్పాక్షిక విచారణ జరగాలని విజ్ఞప్తి చేశారు. కేఎల్ఎస్ఆర్ కంపెనీ అంశంలో నిజాలు నిగ్గుతేల్చాలని గతంలో సుప్రీం కోర్టు సూచించినా రాష్ట్రప్రభుత్వం పట్టించుకోవడం లేదని కేటీఆర్ గుర్తు చేశారు. దివాలా తీసిన కంపెనీకి అడ్డగోలుగా పనులు అప్పగించడం వెనుక భారీ మనీ లాండరింగ్ కోణం ఉందని అనుమానం వ్యక్తం చేశారు. ప్రజాధనాన్ని లూటీ చేస్తున్న ఈ వ్యవహారంపై కేంద్ర ఏజెన్సీలు తక్షణమే స్పందించాలని కోరారు. చట్టం ముందు అందరూ సమానమని నిరూపించేలా అమిత్ షా చర్యలు తీసుకోవాలని విన్నవించారు. కేంద్ర మంత్రి అమిత్ షాతో పాటు ఈ లేఖ ప్రతులను ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్, వాణిజ్య శాఖ మంత్రి పీయూష్ గోయల్, న్యాయశాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్‌కు కేటీఆర్ పంపించారు. సాక్ష్యాలు తారుమారు కాకుండా ఫోరెన్సిక్ ఆధారాలను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. రాష్ట్ర ప్రభుత్వ పెద్దల అనుచిత లబ్దిని అరికట్టాలని దర్యాప్తు సంస్థలు రంగంలోకి దిగాలని కోరారు. తెలంగాణలో వ్యవస్థల స్వతంత్రతను కాపాడటం కోసం కేంద్రం కఠినంగా వ్యవహరించాలని కేటీఆర్ తన లేఖలో స్పష్టం చేశారు.

## వంటగ్యాస్ కష్టాలకు చెక్



ఈ కబురు, హైదరాబాద్ ;
ఇరాన్ వర్సెస్ అమెరికా, ఇజ్రాయిల్ దేశాల మధ్య నెలకొన్న యుద్ధ వాతావరణం అంతర్జాతీయంగా ముడిచమురు సరఫరాపై తీవ్ర ప్రభావం చూపుతోంది. రాష్ట్రంలో వంట గ్యాస్‌కు సంబంధించి అక్కడక్కడ జనాలు ఇబ్బందులు పడుతున్నారు. ఈ పరిణామాల వల్ల గ్యాస్ కొరత ఏర్పడకుండా తెలంగాణ ప్రభుత్వం అప్రమత్తమైంది. రాష్ట్రవ్యాప్తంగా ఎల్పీజీ సిలిండర్ల లభ్యతను నిరంతరం పర్యవేక్షించేందుకు రాష్ట్ర, జిల్లా స్థాయిల్లో ప్రత్యేక పర్యవేక్షణ కమిటీలను ఏర్పాటు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నేతృత్వంలో ఈ కమిటీలు పని చేస్తాయి. గృహ వినియోగదారులతో పాటు అత్యవసర వాణిజ్య విభాగాలకు వంటగ్యాస్ అడ్డంకులు లేకుండా అందేలా చూడటం ఈ కమిటీల ప్రధాన లక్ష్యం. రాష్ట్ర స్థాయి ఎనర్జీ సప్లై మానిటరింగ్ కమిటీకి ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి చైర్‌పర్సన్‌గా వ్యవహరిస్తారు. ఇందులో పౌర సరఫరాల శాఖ కమిషనర్ కన్వీనర్‌గా ఉండగా డీజీపీతో పాటు పారిశ్రామిక, వ్యవసాయ, సమాచార పౌర సంబంధాల శాఖల కార్యదర్శులు సభ్యులుగా ఉంటారు. చమురు విక్రయ సంస్థల ప్రతినిధులు సైతం ఈ బృందంలో భాగస్వాములుగా ఉంటారు. వీరు ప్రతిరోజూ రాష్ట్రంలోని బాట్లింగ్ ప్లాంట్లు, స్టోరేజ్ డిపోల వద్ద నిల్వలను సమీక్షిస్తారు. గ్యాస్ సిలిండర్ల రవాణాలో ఎలాంటి ఆటంకాలు ఎదురైనా వెంటనే పరిష్కరించి వినియోగదారులకు సకాలంలో డెలివరీ అయ్యేలా చర్యలు తీసుకుంటారు. జిల్లా స్థాయిలో కలెక్టర్ అధ్యక్షతన ప్రత్యేక కమిటీలు ఏర్పాటయ్యాయి. జిల్లా పౌర సరఫరాల అధికారి కన్వీనర్‌గా వ్యవహరించే ఈ కమిటీలో ఎస్పీ లేదా సీపీతో పాటు అదనపు కలెక్టర్, రవాణా శాఖ అధికారులు సభ్యులుగా ఉంటారు. స్థానిక గ్యాస్ ఏజెన్సీల వద్ద స్టాక్ పొజిషన్‌ను వీరు నిత్యం తనిఖీ చేస్తారు. సిలిండర్ల కృత్రిమ కొరత సృష్టించినా లేదా బ్లాక్ మార్కెట్‌కు తరలించినా కఠిన చర్యలు తప్పవని ప్రభుత్వం హెచ్చరించింది. నిత్యావసర వస్తువుల చట్టం 1955లోని సెక్షన్ 6A, 7 కింద కేసులు నమోదు చేయాలని కలెక్టర్లను ఆదేశించింది. పోలీస్ శాఖ ఈ ప్రక్రియలో కీలక పాత్ర పోషించనుంది. గ్యాస్ ప్లాంట్లు, స్టోరేజ్ పాయింట్ల వద్ద శాంతి భద్రతల పరిరక్షణ కోసం డీఎస్పీ ర్యాంక్ అధికారులను నియమిస్తారు. అవసరమైన చోట్ల గ్యాస్ ట్యాంకర్లకు పోలీస్ ఎస్కార్ట్ సౌకర్యం కల్పిస్తారు. ప్రతిరోజూ శాంతి భద్రతల పరిస్థితిపై డీజీపీ ఈ కమిటీకి నివేదిక సమర్పిస్తారు. సోషల్ మీడియాలో వచ్చే అసత్య ప్రచారాలను అరికట్టేందుకు సమాచార పౌర సంబంధాల శాఖ ఫ్యాక్ట్ చెక్ నిర్వహిస్తుంది. తప్పుడు వార్తలు వ్యాప్తి చేసే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకునేలా నిఘా పెంచారు. చమురు సంస్థలు ప్రతిరోజూ తమ వద్ద ఉన్న నిల్వలు, బుకింగ్‌లు, పెండింగ్‌లో ఉన్న డెలివరీల వివరాలను నిర్దేశిత ఫార్మాట్‌లో ప్రభుత్వానికి అందజేయాలి. వినియోగదారులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని ప్రభుత్వం భరోసా ఇచ్చింది. గ్యాస్ సరఫరా వ్యవస్థను పటిష్టం చేయడం ద్వారా కొరత సమస్య తలెత్తకుండా ప్రభుత్వం అన్ని జాగ్రత్తలు తీసుకుంటోంది. పారదర్శకమైన పంపిణీ వ్యవస్థ ద్వారా ప్రతి ఇంటికీ వంటగ్యాస్ చేరేలా యంత్రాంగం నిరంతరం శ్రమిస్తోంది.

## సమ్మె నోటీసు ఇచ్చిన తెలంగాణ ఆర్టీసీ జేఏసీ

సమ్మె తేదీపై 14 రోజుల తర్వాత నిర్ణయం తీసుకుంటామని ఆర్టీసీ జేఏసీ తెలిపింది. ఆర్టీసీ ఎండీ అందుబాటులో లేకపోవడంతో పేషీలో నోటీసులు ఇచ్చింది. లేబర్ కమిషనర్ కార్యాలయంలోనూ నోటీసులు ఇచ్చింది. 2021 వేతన సవరణ 30 శాతం ఫిట్‌మెంట్‌తో అమలు చేయాలని ఆర్టీసీ జేఏసీ కోరింది. మహాలక్ష్మి పథకం కింద ప్రతి నెల రూ.350 కోట్లు కోత లేకుండా ఇవ్వాలని, పాత బకాయిలు రూ.2,500 కోట్లు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేసింది. ఆర్టీసీ ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలని, ట్రేడ్ యూనియన్లపై ఆంక్షలు ఎత్తివేయాలని, గుర్తింపు సంఘం




ఎన్నికలు నిర్వహించాలని, ఉద్యోగులపై అధిక పనిభారం తగ్గించాలని జేఏసీ నేతలు డిమాండ్ చేశారు.

# మూసీపై ప్రజెంటేషన్

హైదరాబాద్ నగర నిర్మాణంలో నిజాం ప్రభువుల దూరదృష్టిని సీఎం ప్రత్యేకంగా అభినందించారు. 1908లో వచ్చిన భీకర వరదలకు వేలాది మంది ప్రాణాలు కోల్పోయినప్పుడు, నిజాం రాజు చలించిపోయి మోక్షకుండం విశ్వేశ్వరయ్య వంటి గొప్ప ఇంజనీర్ సలహాతో వరద నియంత్రణకు ప్రణాళికలు సిద్ధం చేశారని గుర్తు చేశారు. ఆనాడు 1921లో నిర్మించిన హిమాయత్ సాగర్, ఉస్మాన్ సాగర్ ప్రాజెక్టులే నేటికీ కోట్లాది మంది హైదరాబాద్ వాసుల దాహార్తిని తీరుస్తున్నాయని కొనియాడారు. 110 ఏళ్ల క్రితమే నిజాం సర్కార్ అంతటి విజన్‌తో నగరాన్ని నిర్మిస్తే, నేడు మనం ఆధునిక కాలంలో ఆ వారసత్వాన్ని మరింత ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత మనపై ఉందని పేర్కొన్నారు.

--చరిత్రలో నిలిచిపోయే పనులు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్న..

రాజకీయంగా విమర్శలు చేయడం కంటే సూచనలు ఇవ్వడం మేలని ప్రతిపక్షాలకు సూచించారు. 12 ఏళ్లు కేంద్రంలో, 10 ఏళ్లు రాష్ట్రంలో అధికారంలో ఉన్నవారు తమ మేధో సంపత్తిని ప్రాజెక్టును అడ్డుకోవడానికి కాకుండా అభివృద్ధికి ఉపయోగించాలని కోరారు. 2050 నాటికి హైదరాబాద్ జనాభా 2 కోట్ల 80 లక్షలకు చేరుకోబోతోందని, వారందరికీ మౌలిక వసతులు కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని తెలిపారు. 1994 నుండి 2024 వరకు గత పాలకులు చంద్రబాబు నాయుడు, రాజశేఖర్ రెడ్డి వంటి వారు చేపట్టిన మంచి విధానాలను తాము కొనసాగిస్తున్నామని, విధానపరమైన అస్పష్టత (Policy Paralysis) తమ ప్రభుత్వంలో లేదని స్పష్టం చేశారు. కేవలం రాజకీయ ప్రసంగాలకే పరిమితం కాకుండా, బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న తాను రాష్ట్ర చరిత్రలో నిలిచిపోయే పనులు చేయడమే లక్ష్యంగా పెట్టుకున్నట్లు రేవంత్ రెడ్డి వివరించారు.

అభివృద్ధి అనేది కేవలం భవనాల నిర్మాణంతోనే ముగియదని భవిష్యత్తు తరాలకు అవసరమైన ప్రణాళికలు రచించినప్పుడే చరిత్రలో పాలకులు నిలిచిపోతారని ఉద్ఘాటించారు. 110 ఏళ్ల క్రితమే నిజాం ప్రభువులు మోక్షకుండం విశ్వేశ్వరయ్య వంటి మేధావుల సలహాలతో నగరాన్ని అంతర్జాతీయ ప్రమాణాలతో తీర్చిదిద్దారని గుర్తు చేశారు. చార్మినార్‌ను కేవలం పర్యాటక కేంద్రంగానే కాకుండా దాని చుట్టూ ముత్యాలు గాజులు వంటి విభిన్న వ్యాపారాలతో ఒక ప్రత్యేక ఆర్థిక మండలిని (SEZ) సృష్టించారని కొనియాడారు. నేడు మనం అనుభవిస్తున్న ఉస్మానియా ఆస్పత్రి యూనివర్సిటీ నీలోఫర్ నిమ్స్ వంటివన్నీ ఆనాడు వారు వేసిన పునాదులేనని పేర్కొన్నారు.

--బాపు ఘాట్‌కు కన్యాకుమారి తరహాలో అంతర్జాతీయ గుర్తింపు

నగరంలో మూసా ఈసా నదుల సంగమ ప్రాంతమైన బాపు ఘాట్‌కు కన్యాకుమారి తరహాలో అంతర్జాతీయ గుర్తింపు తీసుకురావడమే తన సంకల్పమని ముఖ్యమంత్రి వెల్లడించారు. నగరంలోని డ్రైనేజీలు పరిశ్రమల కాలుష్యం వల్ల మూసీ నది కలుషితమై విషంగా మారిందని ఇది హైదరాబాద్ కంటే ఎక్కువగా నల్గొండ జిల్లా ప్రజల జీవితాలను చిన్నాభిన్నం చేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. నల్గొండలో ఫ్లోరోసిస్ శాపానికి తోడు ఈ కాలుష్యం వల్ల పుట్టబోయే పిల్లలు అంగవైకల్యంతో జన్మిస్తున్నారని ఆ ప్రాంత ఆడపిల్లలకు పెళ్లిళ్లు కావడం లేదని వాపోయారు. నల్గొండ ప్రజల కన్నీళ్లు తుడవాల్సిన బాధ్యత మనపై ఉందని వారిని ఈ మురికి కూపం నుండి కాపాడటమే మూసీ ప్రక్షాళన ప్రధాన ఉద్దేశమని స్పష్టం చేశారు. ప్రతిపక్ష పార్టీలు కేవలం రాజకీయ పగతోనే ఈ బృహత్ ప్రాజెక్టును అడ్డుకుంటున్నాయని రేవంత్ రెడ్డి మండిపడ్డారు. బీఆర్ఎస్ బీజేపీ నేతలు అభివృద్ధిని చూసి ఓర్వలేక ప్రజల్లో భయాందోళనలు సృష్టిస్తున్నారని విమర్శించారు. తాము అధికారాన్ని ప్రజలపై ఆధిపత్యం చలాయించడానికి కాకుండా ఒక కాపలాదారుగా నగరాన్ని రక్షించడానికి ఉపయోగిస్తున్నామని తెలిపారు. "నేను ప్రభుత్వ పాఠశాలలో చదువుకున్న సామాన్య రైతు బిడ్డను.. ప్రపంచాన్ని చూసి నేర్చుకుంటున్నాను" అని పేర్కొంటూ పేదలకు అన్యాయం చేసే ఉద్దేశం ప్రభుత్వానికి లేదని స్పష్టం చేశారు. నిరాశ్రయులయ్యే ప్రతి కుటుంబానికి మెరుగైన పునరావాసం కల్పిస్తామని ఇందుకు ఇప్పటికే 10,500 డబుల్ బెడ్రూమ్ ఇళ్లను సిద్ధం చేశామని భరోసా ఇచ్చారు.



--గాంధీ విగ్రహం వంటి నిర్మాణాలకు కేవలం రూ. 250 కోట్లు మాత్రమే

ప్రాజెక్టు వ్యయంపై జరుగుతున్న తప్పుడు ప్రచారాన్ని సీఎం ఎండగట్టారు. మొత్తం రూ. 7,000 కోట్ల వ్యయంలో గాంధీ విగ్రహం వంటి నిర్మాణాలకు కేవలం రూ. 250 కోట్లు మాత్రమే ఖర్చు చేస్తున్నామని ఇది ప్రాజెక్టు మొత్తంలో 2 శాతం కంటే తక్కువేనని వివరించారు. గోదావరి నది నుండి 20 టీఎంసీల నీటిని తరలించి మూసీలో నిరంతరం స్వచ్ఛమైన నీరు ప్రవహించేలా చర్యలు తీసుకుంటున్నట్లు వెల్లడించారు. ఈ ప్రాజెక్టు ద్వారా కేవలం నది అందమే కాకుండా దాని వెంబడి ఎకనామిక్ జోన్లు పర్యాటక క్షేత్రాలు అభివృద్ధి చెందుతాయని తెలిపారు. భారత సైన్యం (Army) కూడా తమ పరిధిలోని 100 ఎకరాల భూమిని ఇచ్చేందుకు ముందుకు రావడం ప్రాజెక్టు ప్రాముఖ్యతకు నిదర్శనమని పేర్కొన్నారు.

--అద్భుతమైన నగరాన్ని అందించడమే తన లక్ష్యం..

ప్రాజెక్టును అడ్డుకునే వారు దేవతల యజ్ఞాలను భగ్నం చేసే రాక్షసుల్లా వ్యవహరిస్తున్నారని ఘాటుగా విమర్శించారు. లోక కల్యాణం కోసం చేసే ఈ యాగంలో ప్రతిపక్షాలు రక్తం మాంసాలు పోసే ప్రయత్నం చేస్తున్నాయని ఆరోపించారు. అయినా వెనక్కి తగ్గేది లేదని మేధావులు నిపుణులు ఇచ్చే ప్రతి సలహాను స్వీకరిస్తామని చెప్పారు. అసెంబ్లీలో కూడా దీనిపై చర్చకు సిద్ధమని ప్రతిపక్షాలకు సవాల్ విసిరారు. హైదరాబాద్‌ను గ్లోబల్ సిటీగా తీర్చిదిద్ది భవిష్యత్తు తరాలకు అద్భుతమైన నగరాన్ని అందించడమే తన లక్ష్యమని రేవంత్ రెడ్డి పునరుద్ఘాటించారు. నగరంలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా మౌలిక వసతులు కల్పించకపోతే రానున్న కాలంలో హైదరాబాద్ కాంక్రీట్ జంగిల్‌గా మారుతుందని హెచ్చరించారు. మూసీ పునరుజ్జీవనం ద్వారా భూగర్భ జలాల నాణ్యత పెరుగుతుందని కాలుష్యం తగ్గుతుందని వివరించారు. నగర ప్రజల భాగస్వామ్యంతోనే ఈ అద్భుతాన్ని ఆవిష్కరిస్తామని ప్రతి ఒక్కరూ ఈ ఉద్యమంలో తోడుగా నిలవాలని పిలుపునిచ్చారు.

# పెను ముప్పు..నీటికి నిప్పు

అందువల్ల అక్కడ సముద్రజలాలను సేకరించి, వాటిలోని లవణాలను తొలగించి, తాగునీటి అవసరాలను తీర్చుకుంటుంటారు. ఈ ప్రక్రియలో సముద్రనీటిని మందపాటి ఫిల్టర్ల గుండా పంప్ చేసి వడకడతారు. ఈ ప్రక్రియను రివర్స్ ఆస్మాసిస్ అంటారు. అలాగే నీటిని ఆవిరి చేసి.. ఈ క్రమంలో లవణాలను వేరు చేసే మరో విధానం కూడా ఉంది. ఈ ప్లాంట్లను నిర్లవణీకరణ కర్మాగారాలు (డీశాలినేషన్ ప్లాంట్లు)గా పిలుస్తారు. వీటి నుంచి ఉత్పత్తయ్యే మంచినీరు గల్ఫ్ ప్రాంతంలోని నగరాలు, పరిశ్రమలు, కొంతమేర వ్యవసాయానికీ ఆధారం. అక్కడ తీరం వెంబడి ఉన్న వందలాది డీశాలినేషన్ ప్లాంట్లు.. కోట్ల లీటర్ల నీటిని సరఫరా చేస్తున్నాయి. కువైట్‌లో 90 శాతం తాగునీరు డిశాలినేషన్ ప్లాంట్ల నుంచే వస్తోంది. ఒమన్‌లో అది 86 శాతం, సౌదీ అరేబియాలో 70 శాతం, యూఏఈలో 42 శాతంగా ఉంది. ఈ కర్మాగారాలన్నీ ఇరాన్ అస్త్రశస్త్రాల పరిధిలో ఉన్నాయి.

--పెను ముప్పు..

నిర్లవణీకరణ ప్లాంట్లు పనిచేయకుంటే గల్ఫ్ ప్రాంతంలోని ప్రధాన నగరాల్లో నీటికి కటకట ఏర్పడుతుంది. డీశాలినేషన్ ప్రక్రియకు భారీగా కరెంటు అవసరం. అందువల్ల గల్ఫ్ ప్రాంతంలోని అనేక నిర్లవణీకరణ ప్లాంట్లు విద్యుత్ కర్మాగారాలతో అనుసంధానమయ్యాయి. ఈ విద్యుత్ మౌలిక వసతులపై దాడి జరిగితే నీటి ఉత్పత్తి కూడా ఆగిపోయే ప్రమాదం ఉంది. అలాగే నిర్లవణీకరణ ప్రక్రియతో ముడిపడ్డ పైప్‌లైన్లు, ఇతర వ్యవస్థలను ధ్వంసం చేసినా నీటి సరఫరాకు ముప్పు ఏర్పడుతుంది. జుబెయిల్ డీశాలినేషన్ ప్లాంట్‌పై కానీ దానితో ముడిపడిన మౌలికవసతులపై కానీ దాడి జరిగితే



సౌదీ అరేబియా రాజధాని రియాద్‌ను వారంలోనే ఖాళీ చేయాల్సి రావొచ్చని 2008లోనే అమెరికా హెచ్చరించింది. ఇలాంటి పరిస్థితిని నివారించడానికి సౌదీ అరేబియా, యూఏఈలు భారీగా పైప్‌లైన్ నెట్‌వర్క్‌లు, స్టోరేజీ రిజర్వాయర్లు, ఇతర మౌలిక వసతులను సమకూర్చుకున్నాయి. డీశాలినేషన్ ప్లాంట్లపై దాడి జరిగినా ఈ ప్రత్యామ్నాయాలు కొంతమేర ఆదుకోవచ్చు. అయితే బహ్రెయిన్, ఖతార్, కువైట్‌లకు ఇలాంటి ఏర్పాట్లు పరిమితంగా ఉన్నాయి. అందువల్ల వాటికి ముప్పు ఎక్కువని నిపుణులు హెచ్చరిస్తున్నారు.

--గురి..

ఈ నెల 8న ఇరాన్ డ్రోన్ దాడి వల్ల బహ్రెయిన్‌లోని నిర్లవణీకరణ కర్మాగారానికి నష్టం వాటిల్లింది. బహ్రెయిన్.. అమెరికా నౌకాదళ 5వ ఫ్లీట్‌కు కేంద్రంగా ఉంది. అందువల్ల ఇరాన్ డ్రోన్లు, క్షిపణుల దాడులకు ఎక్కువగా గురవుతోంది. యూఏఈలోని ఫుజైరా ఎఫ్1 విద్యుత్, నీటి కర్మాగారం కూడా దెబ్బతింది. సమీపంలోని పోర్టుపై దాడి లేదా గాల్లో ధ్వంసమైన డ్రోన్ శకలాలు పడటం వల్ల కానీ ఈ పరిస్థితి తలెత్తి ఉండొచ్చని భావిస్తున్నారు. ఈ నెల 2న దుబాయ్‌లోని జెబెల్ అలీ పోర్టు ఇరాన్ దాడులకు గురైంది. దానికి 19 కిలోమీటర్ల దూరంలోనే భారీ డీశాలినేషన్ ప్లాంట్ ఉంది. దుబాయ్‌లో తాగునీటి అవసరాలను ఎక్కువగా తీర్చేది ఇదే. నాటి దాడిలో ఈ ప్లాంట్‌కు నష్టం జరగకున్నప్పటికీ పొంచి ఉన్న ప్రమాదాన్ని ఇది కళ్లకు కడుతోంది. డీశాలినేషన్ కర్మాగారాలను లక్ష్యంగా చేసుకునే సంస్కృతిని తెచ్చింది అమెరికాయేనని ఇరాన్ ఆరోపిస్తోంది. తమ దేశానికి చెందిన నీటి శుద్ధి కర్మాగారంపై అగ్రరాజ్యం దాడి చేసిందని, దీనివల్ల 30 గ్రామాలకు నీటి సరఫరా నిలిచిపోయిందని మండిపడుతోంది.

## తాగునీరు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోంది : మంత్రి సీతక్క

--తాగునీరు అందించేందుకు కృషి

తెలంగాణ ప్రభుత్వం వేల కోట్ల రూపాయలు ఖర్చు చేసి ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కృషి చేస్తోందని, ప్రతి సంవత్సరం నిర్వహణ కోసం కూడా వందల కోట్ల రూపాయలు ఖర్చు చేస్తున్నామన్నారు. ఈ నేపథ్యంలో నిర్వహణ వ్యయాల్లో కేంద్ర ప్రభుత్వం కూడా భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. కేంద్రం అయినా, రాష్ట్రం అయినా తుది లక్ష్యం ప్రజలకు శుద్ధమైన తాగునీరు అందించడం కావాలని, కలుషిత నీరు సరఫరా అయితే అనేక రకాల వ్యాధులు వ్యాపించి ప్రజల ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. అందువల్ల ప్రజల ఆరోగ్యం మరియు సంక్షేమాన్ని దృష్టిలో ఉంచుకుని జల్ జీవన్ మిషన్ ను మరో రెండు సంవత్సరాలు పొడిగించినందుకు కేంద్ర ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపారు.

--హాకీ మ్యాచ్ ను ప్రారంభించిన మంత్రి సీతక్క

హైదరాబాద్‌లోని గచ్చిబౌలి హాకీ స్టేడియంలో ఉరుగ్వే - ఆస్ట్రియా జట్ల మధ్య జరిగిన మహిళల హాకీ వరల్డ్ కప్ క్వాలిఫైయర్స్ మ్యాచ్‌ను రాష్ట్ర మంత్రులు సీతక్క, అజారుద్దీన్ శుక్రవారం ప్రారంభించారు. అంతర్జాతీయ స్థాయి క్రీడా పోటీలు తెలంగాణలో నిర్వహించడం రాష్ట్రానికి గర్వకారణమని ఈ సందర్భంగా వారు పేర్కొన్నారు. మ్యాచ్ ప్రారంభానికి ముందు మంత్రి సీతక్క ఇరు జట్ల క్రీడాకారిణులను వ్యక్తిగతంగా పరిచయం చేసుకొని వారికి ఆల్ ది బెస్ట్ చెప్పారు. క్రీడాస్ఫూర్తితో అత్యుత్తమ ప్రదర్శన ఇవ్వాలని, ఈ పోటీలు అంతర్జాతీయ స్థాయిలో మహిళల హాకీ అభివృద్ధికి దోహదపడతాయని ఆశాభావం వ్యక్తం చేశారు. క్రీడల ద్వారా దేశాల మధ్య స్నేహ సంబంధాలు మరింత బలపడతాయని సీతక్క పేర్కొన్నారు.

--క్రీడల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత

తెలంగాణ ప్రభుత్వం క్రీడల అభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. యువతలో క్రీడాస్ఫూర్తిని పెంపొందించేందుకు ఆధునిక క్రీడా మౌలిక వసతులు కల్పిస్తున్నామని తెలిపారు. ప్రపంచ స్థాయి క్రీడా పోటీలను తెలంగాణలో నిర్వహించడం ద్వారా రాష్ట్రం అంతర్జాతీయ క్రీడా పటంలో ప్రత్యేక గుర్తింపు పొందుతోందని అన్నారు.మహిళా క్రీడాకారిణులకు మరిన్ని అవకాశాలు కల్పించేందుకు ప్రభుత్వం కృషి చేస్తోందని పేర్కొన్నారు. క్రీడలు యువతకు ఆరోగ్యం, క్రమశిక్షణ, ఆత్మవిశ్వాసాన్ని అందిస్తాయని ఆమె అన్నారు. తెలంగాణలో క్రీడల అభివృద్ధి కోసం ప్రభుత్వం ప్రత్యేక కార్యక్రమాలు అమలు చేస్తోందని, భవిష్యత్తులో మరిన్ని అంతర్జాతీయ పోటీలను రాష్ట్రంలో నిర్వహించేందుకు ప్రయత్నాలు కొనసాగుతున్నాయని తెలిపారు. దేశంలోని తొలి క్రీడ యూనివర్సిటీని తెలంగాణలో ప్రారంభిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఏ టీ జీ చైర్మన్ శివసేనారెడ్డి, ఎండీ సోనీ బాలాదేవి, తెలంగాణ హాకీ అసోసియేషన్ సెక్రటరీ భీమ్ సింగ్, క్రీడా శాఖ అధికారులు, క్రీడా సంఘాల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.మ్యాచ్‌ను వీక్షించేందుకు పెద్ద సంఖ్యలో క్రీడాభిమానులు హాజరై క్రీడాకారిణులను ఉత్సాహపరిచారు. తెలంగాణలో ఇలాంటి అంతర్జా



తీయ క్రీడా పోటీలు నిర్వహించడం రాష్ట్ర క్రీడా రంగ అభివృద్ధికి దోహదపడుతుందని పలువురు అభిప్రాయపడ్డారు. అదే సమయంలో రాష్ట్రాలు అమలు చేస్తున్న తాగునీటి సరఫరా పథకాల నిర్వహణ ఖర్చులను కూడా కేంద్ర ప్రభుత్వం పంచుకోవాలని మేము మరోసారి విజ్ఞప్తి చేస్తున్నాము. నూతనంగా ఏర్పాటు అవుతున్న ఆవాసాలకు తాగు నీరు అందించేందుకు నూతనంగా ప్రాజెక్టులను టేకప్ చేస్తున్నాము. సోర్స్ పాయింట్ లో డ్రై అయినప్పుడు, ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తున్నావు. లోకల్ సోర్స్ పాయింట్లను నిర్మిస్తున్నాము. దీనికి సంబంధించి కూడా కేంద్రం తన వంతు సహాయం చేయాలన్నారు. సీతక్క ప్రతిపాదనలకు సానుకూలంగా స్పందించిన కేంద్రం మంత్రి..త్వరలో సమావేశం లో చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు.

## ఉమ్మడి ఏపీ మాజీ డీజీపీ హెచ్‌జే దొర కన్నుమూత



తిరిగి ఇంటికి వెళ్లిన తర్వాత ప్రమాదవశాత్తు బాత్‌రూమ్‌లో పడిపోయినట్లు తెలుస్తోంది. కుటుంబ సభ్యులు మళ్లీ ఆయన్ను నిమ్స్‌కు తరలించగా.. చికిత్స పొందుతూ ప్రాణాలు కోల్పోయారు.ఏపీలోని శ్రీకాకుళం జిల్లాలో 1943లో హెచ్‌జే దొర జన్మించారు. ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి ఎకనమిక్స్‌లో మాస్టర్స్ డిగ్రీ పొందిన ఆయన.. 1965లో ఐపీఎస్‌లో చేరారు. తన 40 ఏళ్ల సుదీర్ఘ కెరీర్‌లో వామపక్ష తీవ్రవాదాన్ని అరికట్టేందుకు, సమర్థవంతమైన పోలీసింగ్ ద్వారా హింసను తగ్గించేందుకు విశేష కృషి చేశారు. శాంతిభద్రతల పరిరక్షణలో ఆయన చేసిన విశిష్ట సేవలకు గానూ 'పోలీస్ మెడల్ ఫర్ గ్యాలంట్రీ' అవార్డు లభించింది. ఐపీఎస్ శిక్షణ పూర్తి చేసుకున్న ఆయన హైదరాబాద్‌లో డిప్యూటీ కమిషనర్ ఆఫ్ పోలీస్‌గా తన ఉద్యోగ జీవితం ప్రారంభించారు. ఆ తర్వాత కృష్ణా జిల్లా ఎస్పీగా పని చేశారు. సీబీఐలో ఎస్పీగా పని చేసిన సమయంలో అంతర్రాష్ట్ర, ఆర్థిక నేరాలను ఛేదించడంలో నైపుణ్యం సంపాదించారు. స్టేట్ ఇంటెలిజెన్స్ బ్యూరో డైరెక్టర్‌గానూ, సీఐడీ హెడ్‌గానూ సేవలందించారు. 1996 నవంబర్‌లో ఏపీ డీజీపీగా నియమితులై.. ఫిబ్రవరి 2002 వరకు ఐదేళ్లకుపైగా ఆ పదవిలో కొనసాగారు. డీజీపీగా పదవీ విరమణ చేసిన తర్వాత, సెప్టెంబర్ 11, 2002న సెంట్రల్ విజిలెన్స్ కమిషన్‌లో విజిలెన్స్ కమిషనర్‌గా నియమితులయ్యారు. దీనికి ముందు ఆయన సీఐఎస్ఎఫ్ డైరెక్టర్ జనరల్‌గానూ సేవలందించారు. అవినీతి నిర్మూలన, ప్రభుత్వ యంత్రాంగంలో పారదర్శకత కోసం ఆయన కృషి చేశారు. 'ఇంపాక్ట్ ఆఫ్ ట్రైనింగ్ ఆన్ ది పెర్ఫార్మెన్స్ ఆఫ్ ఐపీఎస్ ఆఫీసర్స్', 'ఎన్టీఆర్‌తో నేను' అనే రెండు పుస్తకాలు రాశారు. అంతేకాకుండా 'జర్నీ థ్రూ ట్రబులెంట్ టైమ్స్' పేరిట ఆత్మకథ రాశారు.

## ఏపీలో సఖి నివాస్ పథకం

# ఏపీ క్యాబినెట్ ఆమోదం

ఏపీఎస్పీ లోని 2, 3, 5, 6, 9, 11, 14, 16వ బెటాలియన్లలో పనిచేస్తున్న 300 మంది హెడ్ కానిస్టేబుల్ పోస్టులను అసిస్టెంట్ రిజర్వ్ సబ్ ఇన్‌స్పెక్టర్లుగా స్థాయిని పెంచడానికి మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఇరిగేషన్,రెవిన్యూ అంశాల పైన చర్చించిన మంత్రివర్గం పలు నిర్ణయాలకు ఆమోద ముద్ర వేసింది. ఉపాధి కల్పనకు సంబంధించి కొత్త పథకానికి ఆమోదం తెలిపారు. పారిశ్రామిక ప్రాజెక్టులు సరైన సమయం లో అమలు జరగడానికి, పారిశ్రామికవేత్తలు బ్యాంకులు మరియు ఆర్థిక సంస్థల నుండి రుణ సహాయం సులభంగా పొందడానికి, రాష్ట్రంలో వ్యాపారం చేయడం మరింత సులువు చేయడానికి, పెట్టుబడులు వేగవంతం చేయడానికి మరియు ఉపాధి అవకాశాలు పెంచడానికి అవసరమైన చర్యలకు మంత్రి మండలి ఆమోదం తెలిపింది. ఎలాంటి అభ్యంతరాలు లేని 66,157 ఎకరాల ఏపీఐఐసీ భూములను సెక్షన్ 22 ఏ నిషేధిత జాబితా నుంచి తక్షణమే తొలగించడానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి ఎంప్లాయ్‌మెంట్ జనరేషన్ ప్రోగ్రాం పేరిట ప్రతిపాదిత పథకానికి ఆమోదం తెలిపింది. ఈ పథకం కింద దాదాపు 3,500 మంది మైక్రో ఎంటర్‌ప్రెన్యూర్లకు వారి తయారీ కార్యకలాపాలకు ఆర్థిక సహాయం అందనుంది.అమరావతి ప్రభుత్వ కాంప్లెక్స్ పరిధిలో ఇంటిగ్రేటెడ్ ఆంధ్రప్రదేశ్ స్టేట్ సెక్రెటేరియట్ మరియు హెచ్ ఓ డి కార్యాలయాలు (జి ఏ డి టవర్, టవర్లు 3 , 4 మరియు టవర్లు 1,2)లో హై సైడ్ ఎలక్ట్రికల్, హెచ్ వి ఏ సి , ఫైర్ ప్రొటెక్షన్ సిస్టమ్, లిఫ్ట్ లు, ఫైర్ అలారం మరియు పబ్లిక్ అడ్రస్ సిస్టమ్ మరియు ప్లంబింగ్ వర్కుల ఎం ఈ పి పనులకు 2,316.88 కోట్ల మొత్తానికి రాష్ట్ర మంత్రి మండలి పరిపాలన ఆమోదం తెలిపింది. అమరావతిలోని నీరుకొండ (వి)లో ఈ పి సి కాంట్రాక్ట్ పద్ధతిలో 'తెలుగు కల్చరల్ సెంటర్' నిర్మాణ పనులకు జీఎస్టీ మరియు ఇతర నిబంధనలతో కలిపి 119.27 కోట్ల మొత్తానికి రాష్ట్ర మంత్రి మండలి పరిపాలన ఆమోదం తెలిపింది. ఆంధ్రప్రదేశ్‌లో మిషన్ శక్తి కింద 'సఖి నివాస్ పథకం' (క్రెష్ సదుపాయంతో కూడిన వర్కింగ్ విమెన్ హాస్టళ్ళు) అమలు చేయడానికి ఆమోదం తెలిపింది.

--మంత్రులు సిద్ధంగా ఉండాలి.. చంద్రబాబు దిశా నిర్దేశం..



ముఖ్యమంత్రి చంద్రబాబు ఏపీ కేబినెట్ భేటీలో అమరావతి సహా పలు కీలక అంశాల పైన చర్చించారు. యుద్ధం కారణంగా ఏర్పడిన పరిస్థితులు, రాష్ట్రంలో వంట గ్యాస్ సరఫరా పైన అధికారులు వివరించారు. ఇప్పటికే నియమించిన కేబినెట్ సబ్ కమిటీ అవసరమైన చర్యలు తీసుకోవాలని నిర్దేశించారు. వేసవి వేళ కీలక నిర్ణయాల అమలుకు కేబినెట్ నిర్ణయం తీసుకుంది. ఇక, మంత్రులకు ముఖ్యమంత్రి చేసిన హెచ్చరిక ఇప్పుడు సంచలనంగా మారింది. అధికారిక అజెండా పూర్తి చేసిన తరువాత మంత్రులతో తాజా పరిస్థితుల పైన చర్చించారు. ఏప్రియల్ 1 నుంచి 90 రోజులు పాటు జలధార కార్యక్రమం నిర్వహించనున్నట్లు తెలిపారు. భూగర్భ నీటిమట్టం పెంచాల ని సూచించారు. మే 15 నుంచి కాలువలకు నీరు విడుదల చేయాలన్నారు. ఇందుకు మంత్రులు రైతులను సమాయత్తం చేయాలని సూచించారు. వెలుగొండ ఫేజ్ 1 ను ఈ ఏడాది జూన్ నాటికి పూర్తి చేస్తామని సీఎం స్పష్టం చేసారు. కృష్ణా కరకట్ట కు బలహీనంగా ఉన్న ప్రాంతాల్లో పటిష్ట పరచాలని ఆదేశాలు ఇచ్చారు. మార్చి 16 న అన్ని జిల్లాలో పొట్టి శ్రీరాములు జయంతి కార్యక్రమం ను నిర్వహించాలని సీఎం ఆదేశించారు. ఈ కార్యక్రమం కోసం మంత్రి సవిత ఆధ్వర్యంలో కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసారు. కాగా, యుద్ధం కారణంగా ప్రజలు ఇబ్బంది పడకుండా ఒక కేబినెట్ సబ్ కమిటీ ఏర్పాటు చేసినట్లు వెల్లడించారు.

ఈ సబ్ కమిటీలో మంత్రులు కేశవ్, అచ్చం నాయుడు, నాదెండ్ల మనోహర్ సభ్యులుగా ఉంటారు. గ్యాస్ లేని పక్షంలో ఇండక్షన్ స్టవ్ లు కొంటున్నారని మంత్రి కేశవ్ చెప్పుకొచ్చారు. అయితే, శాఖల్లో మంత్రులు, అధికారులు పై కాన్ఫిడెన్షియల్ రిపోర్ట్ ను ఏప్రియల్ 2 వ తేదీన ఇస్తానని సీఎం చంద్రబాబు చెప్పారు. ఈ నివేదిక ఆధారంగా 20262027 సంవత్సరంలో పని తీరు మెరుగుపరచుకోవాలి సూచించారు. ఈ నివేదికలో లక్ష్యాలు సాధించడం, ఫైల్స్ క్లియరెన్స్, కేంద్ర నిధులు వినియోగం, పథకాల అమలు వంటి అంశాలు రహస్య నివేదికలో ఉంటాయని వెల్లడించారు. పంచాయతీ లు మాదిరిగా జలవనరుల శాఖ కూడా నీటి పన్ను వసూలు చేయాలి అని ముఖ్యమంత్రి మంత్రి రామానాయుడు కు తెలిపారు. మంత్రులు చేసిన పనిని మీరు మీడియా కు చెప్పుకోవడంలో ఫెయిల్ అవుతున్నారని వ్యాఖ్యానించారు. ఇప్పటివరకు ప్రభుత్వాన్ని స్థిరత్వానికి తీసుకువచ్చామని, ఇక ఇప్పుడు టేక్ ఆఫ్ చేయాలి అని చెప్పారు. అందరూ టెక్నాలజీని ఉపయోగించుకోవాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ఆరు నెలల్లో స్థానిక సంస్థల ఎన్నికలు వస్తున్నాయని ,అందరు సిద్ధంగా ఉండాలి ముఖ్యమంత్రి అన్నారు. ఇప్పటివరకు జరిగిన అన్ని ఎన్నికల్లో గెలిచాం అని చెప్పారు. ఇక ఎన్నిక ఏదైనా మనమే గెలవాలి అని ముఖ్యమంత్రి స్పష్టం చేసారు.

## కామాఖ్య – చర్లపల్లి 'అమృత్ భారత్' ఎక్స్ ప్రెస్ రైలు ప్రారంభం



దీనితో ఈశాన్య ప్రాంతాల వైపు వెళ్లే ప్రయాణికులకు తక్కువ ఛార్జీలతో సౌకర్యవంతమైన ప్రయాణం సాధ్యమవుతుంది. ఈ రైలు మార్గ మధ్యంలో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లోని శ్రీకాకుళం రోడ్డు, విజయనగరం జంక్షన్, పెందుర్తి, దువ్వాడ, సామర్లకోట జంక్షన్, రాజమహేంద్రవరం, తణుకు, భీమవరం పట్టణం, గుడివాడ, విజయవాడ, గుంటూరు, నల్గొండ స్టేషన్లలో ఆగుతూ, అక్కడి నుంచి చర్లపల్లికి చేరుకుంటుంది.

## తిరుమల కొండపై కొనసాగుతున్న భక్తుల రద్దీ



తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) వెల్లడించిన వివరాల ప్రకారం.. నిన్న (మార్చి 12న) మొత్తం 68,754 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. అలాగే 25,569 మంది యాత్రికులు స్వామి వారికి తలనీలాలు సమర్పించారు. గురువారం నాడు భక్తులు సమర్పించిన కానుకల ద్వారా శ్రీవారి హుండీకి రూ.3.68 కోట్ల ఆదాయం సమకూరినట్లు అధికారులు తెలిపారు.

ప్రస్తుతం తిరుమలలో రద్దీ ఎక్కువగా ఉండటంతో వెలుపల ఉన్న క్యూలైన్లు కృష్ణా తేజ అతిథి గృహం వరకు చేరుకున్నాయి. కంపార్ట్‌మెంట్లు అన్నీ నిండిపోవడంతో టోకెన్లు లేని సాధారణ భక్తులకు (సర్వదర్శనం) శ్రీవారి దర్శనం కోసం సుమారు 18 నుంచి 24 గంటల వరకు సమయం పడుతోందని అధికారులు వెల్లడించారు. భక్తులు ఈ రద్దీని దృష్టిలో ఉంచుకుని తమ యాత్రను ప్రణాళిక చేసుకోవాలని సూచిస్తున్నారు. ఎండల తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో క్యూలైన్లలో ఉన్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా టీటీడీ అధికారులు నిరంతరం అన్నప్రసాదాలు, తాగునీరు అందిస్తున్నారు.

# పేదల ఇండ్లు కూలిస్తే సహించేది లేదు



మూసీపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ పట్ల తమకు ఎలాంటి అభ్యంతరం లేదని ఆయన అన్నారు. మూసీ నది పునరుజ్జీవనం గానీ, మూసీ ప్రాజెక్టును గానీ తమ పార్టీ ఎప్పుడూ వ్యతిరేకించలేదన్నారు. మూసీ నది హైదరాబాద్ నగరం నుంచి కృష్ణానదిలో కలిసే వరకు పరిశుభ్రంగా ఉండాలని, అందులో స్వచ్ఛమైన నీరు ప్రవహించాలని, ఆ నీరు రైతులకు సాగునీటిగా ఉపయోగపడాలని తమ పార్టీ కోరుకుంటోందని తెలిపారు. అయితే ఈ అంశంపై కాంగ్రెస్ నాయకులు పదేపదే తప్పుడు ఆరోపణలు చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టించే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. ముఖ్యమంత్రి, మంత్రి పొన్నం ప్రభాకర్ తదితరులు తమ పార్టీ రకరకాల వ్యాఖ్యలు విమర్శలు చేస్తున్నారని ఆయన తెలిపారు. మూసీ నది తప్పకుండా పునరుజ్జీవనం కావాలని ఇప్పటికీ చెబుతున్నామని, కానీ 'గాంధీ సరోవర్' పేరుతో అక్కడ నివసిస్తున్న పేద, మధ్యతరగతి కుటుంబాల ఇళ్లను కూల్చడం భావ్యం కాదన్నారు. మధుబన్ పార్క్, విఘ్నేశ్వర్ కాలనీ వంటి ప్రాంతాల్లో చట్టబద్ధంగా నిర్మించిన ఇళ్లను కూల్చాల్సిన అవసరం లేదని, ఆ ఇళ్లను కూల్చకుండా కూడా మూసీని శుద్ధి చేయవచ్చని ఆయన తెలిపారు. సబర్మతి నదిని ఉదాహరణగా చెబుతూ మాట్లాడేవారు అసలు అక్కడ ప్రాజెక్టు ఎలా జరిగిందో తెలుసుకోవాలని సూచించారు. ఒకప్పుడు సబర్మతి కూడా మూసీలా కాలుష్యంతో, దుర్వాసనతో ఉండేదని గుర్తుచేశారు. నరేంద్ర మోదీ గారు గుజరాత్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు నర్మదా నది నుంచి నీటిని సబర్మతికి మళ్లించి, నదుల అనుసంధానం చేసి, ముందుగా నది శుభ్రపరిచారని చెప్పారు. గాంధీ సరోవర్ కోసం భూమి అవసరమైతే ప్రాజెక్టును రీఅలైన్ చేసి ఒక్క ఇల్లు కూడా దెబ్బతినకుండా ప్రణాళిక రూపొందించాలని అన్నారు. గాంధీ విగ్రహం నిర్మించాలనుకుంటే వెయ్యి అడుగులైనా, రెండువేల అడుగులైనా ఆకాశాన్ని తాకేలా నిర్మించొచ్చని, దానికి తమకు అభ్యంతరం లేదని తెలిపారు. దేశంలో గ్యాస్, ఆయిల్, డీజిల్, పెట్రోల్ దొరకవని ప్రజల్లో భయం సృష్టించడం పూర్తిగా బాధ్యతారాహిత్యమని అన్నారు. రాహుల్ గాంధీ వంటి కాంగ్రెస్ నేతలు ఇలాంటి వ్యాఖ్యలు చేయడం దురదృష్టకరమన్నారు. ఈ అంశాన్ని కేంద్ర ప్రభుత్వం చాలా సీరియస్‌గా తీసుకుందని చెప్పారు. జైశంకర్, ప్రధాని నరేంద్ర మోదీ సంబంధిత దేశాల నాయకులతో మాట్లాడి, భారతదేశానికి రావాల్సిన చమురు, గ్యాస్ సరఫరాలు హోర్ముజ్ జల సంధి ద్వారా అంతరాయం లేకుండా దేశానికి చేరేలా చర్యలు తీసుకున్నారని తెలిపారు. మన దేశం ఒకే ప్రాంతంపై ఆధారపడదని, దాదాపు 40 శాతం ముడి చమురు ఇతర దేశాల నుంచీ వస్తోందని చెప్పారు. అందువల్ల దేశంలో గ్యాస్ సిలిండర్లు, పెట్రోల్, డీజిల్ కొరత ఉండదని రాంచందర్ రావు చెప్పారు.

## భారత్ మా మిత్రదేశం ఇరాన్ రాయబారి



భారత్ తమకు మిత్రదేశమన్న ఆయన.. ఇరు దేశాల మధ్య బలమైన సంబంధాలు ఉన్నాయన్నారు. ఓ వార్తా సంస్థతో ఆయన మాట్లాడుతూ.. భారత నౌకలు సురక్షితంగా వచ్చేలా చూస్తామన్నారు. ఇరు దేశాలు ఈ ప్రాంతంలో ఉమ్మడి ప్రయోజనాలు కలిగి ఉన్నాయని ఇరాన్ రాయబారి పేర్కొన్నారు. ప్రస్తుతం నెలకొన్న పరిస్థితుల్లో భారత ప్రభుత్వం వివిధ అంశాల్లో సాయం చేసిందన్నారు. హర్మూజ్ ద్వారా కొన్ని దేశాల నౌకలు వెళ్లేందుకు అనుమతిస్తామని ఇరాన్ డిప్యూటీ విదేశాంగ మంత్రి ప్రకటించిన మరుసటి రోజే ఫత్‌హలీ ఈ వ్యాఖ్యలు గమనార్హం. ఇదిలాఉంటే, నౌకలకు సంబంధించి ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీతో పలుమార్లు చర్చలు జరిపినట్లు భారత విదేశాంగ ఇటీవల పేర్కొన్న విషయం తెలిసిందే.

--లెబనాన్‌లో 100కు చేరిన చిన్నారుల మరణాలు

లెబనాన్‌లోని హెజ్‌బొల్లా నేతలే లక్ష్యంగా ఇజ్రాయెల్ కొనసాగిస్తోన్న భీకర దాడుల్లో ఇప్పటివరకు 100 మంది చిన్నారులు ప్రాణాలు కోల్పోయినట్లు లెబనాన్ ఆరోగ్యశాఖ వెల్లడించింది. రెండు వారాల క్రితం మొదలైన యుద్ధంలో ఇప్పటివరకు 773 మంది చనిపోయారని, వారిలో 62 మంది మహిళలు ఉన్నారని తెలిపింది. ఈ దాడుల్లో మరో 1900 మంది గాయపడినట్లు లెబనాన్ ఆరోగ్యశాఖ పేర్కొంది.

## ఈసీ అభిశంసనకు

# విపక్షాల నోటీసులు




ఈ క్రమంలో కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్ (CEC) జ్ఞానేశ్ కుమార్‌పై అభిశంసన తీర్మానం ప్రవేశపెట్టేందుకు విపక్షాలు సిద్ధమయ్యాయి. ఈ మేరకు లోక్‌సభ, రాజ్యసభల్లో అభిశంసన తీర్మానం నోటీసులు అందజేసినట్లు అధికారిక వర్గాలు వెల్లడించాయి. నోటీసులపై 130 మంది లోక్‌సభ, 63 మంది రాజ్యసభ ఎంపీలు సంతకాలు చేసినట్లు సమాచారం.కేంద్ర ప్రధాన ఎన్నికల కమిషనర్‌పై విపక్షాలు ఇలా అభిశంసన నోటీసు ఇవ్వడం ఇదే తొలిసారి. అయితే, సీఈసీ పక్షపాతంగా వ్యవహరించడం.. తదితర ఏడు అభియోగాలు మోపినట్లు తెలుస్తోంది. విపక్ష ఇండియా కూటమిలో ఆమ్‌ఆద్మీ పార్టీ లేనప్పటికీ.. విపక్షాల తీర్మానంపై సంతకాలు చేసినట్లు తెలుస్తోంది. కొందరు స్వతంత్ర ఎంపీలు కూడా సంతకాలు చేయగా.. మరింత మంది ఎంపీలు ఈ తీర్మానానికి మద్దతుగా నిలిచేందుకు సిద్ధంగా ఉన్నట్లు సమాచారం.

## అప్పుడు మహిళలను ఉద్యోగాల్లోకి తీసుకోరు

### నెలసరి' సెలవుపై సుప్రీంకోర్టు

ఈ కబురు : నెలసరి సెలవును తప్పనిసరి చేస్తే అది మహిళల ఉపాధి అవకాశాలపై ప్రతికూల ప్రభావం చూపుతుందని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. మనం అలాంటి చట్టాలు చేస్తే.. కంపెనీలు మహిళలను తీసుకోవని అభిప్రాయపడింది. ఆ సెలవు (Menstrual Leave)కు సంబంధించిన నియమాలను రూపొందించేలా రాష్ట్రాలను ఆదేశించాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై శుక్రవారం విచారణ జరిగింది. ఈ సందర్భంగా అత్యున్నత న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది. ''అలాంటి చట్టం తాము పురుషుల కంటే తక్కువ అనే భయం ఉద్యోగాలు చేసే మహిళల్లో సృష్టించే అవకాశం ఉంది. రుతుక్రమం అంశంపై అవగాహన కల్పించడం వేరు.. దానిని సెన్సేషన్ చేయడం వేరు. ఈ సెలవును తప్పనిసరి చేస్తూ చట్టాన్ని తీసుకువచ్చిన మరుక్షణం ఎవరూ వారిని నియమించుకోరు. సంస్థల యాజమాన్యాల మనస్తత్వం మీకు తెలియదు'' అంటూ పిటిషనర్‌ను ఉద్దేశించి ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ హెచ్చరించారు. ఈ సందర్భంగా సీనియర్ న్యాయవాది ఎంఆర్ షంషద్ తన వాదనలు వినిపించారు. 2013లో ప్రభుత్వం ఆధ్వర్యంలోని విశ్వవిద్యాలయాల్లో విద్యార్థినులకు నెలసరి సెలవును మంజూరుచేసిన విషయాన్ని గుర్తుచేశారు. ప్రైవేటు కంపెనీలు కూడా అలాంటి వెలుసుబాటును కల్పించాయని కోర్టు కు వెల్లడించారు. దీనిపై ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ.. అవన్నీ స్వచ్ఛందంగా తీసుకున్న చర్యలన్నారు. ఆ సెలవును తప్పనిసరి చేస్తే.. మహిళల కెరీర్ ముగుస్తుందని మరోసారి ప్రస్తావించారు. మహిళల కెరీర్‌ను దృష్టిలోపెట్టుకొని గతంలో ఈ అంశంపై సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ''ఇందులో రెండు పార్శ్వాలు ఉన్నాయి. నెలసరి సెలవులు ఇస్తే ఉద్యోగాల్లో చేరేందుకు మరింతమంది మహిళలను ప్రోత్సహించినట్లవుతుంది.

అయితే, వీటిని తప్పనిసరి చేయాలని యజమానులను బలవంతపెడితే అది ప్రతికూల పరిస్థితులకు దారితీయొచ్చు. మహిళలను ఉద్యోగాల్లో నియమించుకునే అవకాశాలు కూడా తగ్గొచ్చు. అది మేం కోరుకోవట్లేదు.

ఎందుకంటే మహిళల ప్రయోజనాల కోసం కొన్నిసార్లు మనం చేసే ప్రయత్నాలు వారి భవిష్యత్తుకు అడ్డంకిగా మారొచ్చు'' అని ధర్మాసనం వ్యాఖ్యానించిన సంగతి తెలిసిందే.

## దేశంలో వరి ఉత్పత్తిలో మొదటి స్థానం తెలంగాణదే



ఉత్పత్తి పెరిగిన నేపథ్యంలో రైతులకు మెరుగైన ఆదాయం అందించడానికి ఎగుమతులు, విలువ ఆధారిత ఉత్పత్తులు, ఫుడ్ ప్రాసెసింగ్‌లపై దృష్టిని సారించాలని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఫుడ్ ప్రాసెసింగ్ కోసం మౌలిక వసతులు, అగ్రి ఆధారిత పరిశ్రమల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి సారించిందని తెలిపారు. ఖమ్మం జిల్లా బుగ్గపాడు వద్ద స్థాపించనున్న మెగా ఫుడ్ పార్క్ గురించి ఆయన వివరించారు. తెలంగాణ ఉద్యాన రంగానికి.. ముఖ్యంగా పండ్లు, కూరగాయలు, పసుపు, మిర్చి వంటి పంటలకు ఎగుమతుల్లో మంచి అవకాశాలున్నాయన్నారు. సరఫరా, ప్యాక్ హౌస్‌లు, కోల్డ్ స్టోరేజీ, లాజిస్టిక్స్ నెట్‌వర్క్ మెరుగుపడితే అంతర్జాతీయ మార్కెట్‌లో మన ఉత్పత్తుల స్థానం మరింత బలపడుతుందని చెప్పారు.

## రాజ్యాంగాన్ని రక్షించడమంటే ఇదేనా..?

## ..రాహుల్‌గాంధీకి హరీశ్‌రావు లేఖ

రాహుల్‌గాంధీ రాజ్యాంగం చేతబట్టి దేశవ్యాప్తంగా నీతి సూత్రాలు చెప్పారు. కానీ కాంగ్రెస్ అధికారంలో ఉన్న తెలంగాణలో మరోలా వ్యవహరిస్తున్నారు. రాజ్యాంగాన్ని కాంగ్రెస్ పార్టీ రక్షించడమంటే ఇదేనా..? ఫిరాయింపుల నిరోధక చట్టాన్ని అవకాశవాదం కోసం వాడుకుంటున్నారు'' అని లేఖలో హరీశ్‌రావు ధ్వజమెత్తారు.



## చమురు మంటల్లో రష్యాపై సిరుల వాన..

# రోజుకు రూ.3,700 కోట్ల ఆదాయం



పశ్చిమాసియాలో యుద్ధం ముగింపు ఛాయలు కనిపించడం లేదు. ఈ సంక్షోభంతో చమురు ధరలు భగ్గుమంటున్నాయి (Oil Prices). దీంతో రష్యా చమురుపై విధించిన మరికొన్ని ఆంక్షలను అమెరికా ప్రభుత్వం సడలించింది. ఇప్పటికే నౌకల్లో లోడ్ అయిన చమురు కొనుగోలుకు అనుమతులు ఇస్తూ నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు అమెరికా ట్రెజరీ డిపార్ట్‌మెంట్ ఓ ప్రకటన చేసింది. అంతర్జాతీయ ఇంధన మార్కెట్లలో స్థిరత్వాన్ని తీసుకువచ్చేందుకే ఈ తాత్కాలిక చర్యలు అని ట్రెజరీ సెక్రటరీ స్కాట్ బెసెంట్ వెల్లడించారు. ''ఇప్పటికే రవాణాకు సిద్ధమైన చమురుకు మాత్రమే ఈ నిర్ణయం వర్తిస్తుంది. ఇది రష్యా (Russia)కు ఎలాంటి ఆర్థిక ప్రయోజనాన్ని ఇవ్వదు'' అని వెల్లడించారు. ఇటీవల భారతీయ శుద్ధి కర్మాగారాలు రష్యా నుంచి చమురు కొనుగోలు చేయడానికి తాత్కాలికంగా 30 రోజులు మినహాయింపు ఇస్తున్నట్లు బెసెంట్ ఎక్స్ వేదికగా పోస్టు పెట్టిన సంగతి తెలిసిందే. ఈ పరిణామాలపై రష్యా నుంచి స్పందన వచ్చింది. ప్రపంచ ఇంధన మార్కెట్లకు రష్యా చమురు ఎంత కీలకమో తాజా ప్రకటన వెల్లడి చేస్తోందని పేర్కొంది. తమ చమురు లేకుండా అంతర్జాతీయ మార్కెట్లు స్థిరంగా ఉండలేవని వ్యాఖ్యానించింది.

**మార్కెట్‌లోకి 19 మిలియన్ బ్యారెళ్ల చమురు..**

ఇప్పటికే లోడ్ అయిన చమురు రవాణాకు అమెరికా (USA) ఆంక్షలు సడలించడంతో.. అంతర్జాతీయ ఇంధన మార్కెట్‌లో రష్యాకు చెందిన 30 ట్యాంకర్లలోని చమురు కొనుగోలు కోసం అందుబాటులో ఉంది. ఈ నౌకల్లో 19 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురు, 3,10,000 టన్నుల రిఫైన్డ్ ఉత్పత్తులు ఉన్నాయి.

**రష్యాకు ఊహించని లాభాలు..**

అమెరికాఇజ్రాయెల్ సంయుక్త దాడులతో పశ్చిమాసియా దేశాల్లో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. యుద్ధం వల్ల ఇంధన ధరలు పెరగడం రష్యాకు అనుకూలిస్తోందని, యుద్ధంలో రష్యానే విజేత అని యూరోపియన్ కౌన్సిల్ అధ్యక్షుడు ఆంటోనియో కోస్టా ఇటీవల వ్యాఖ్యలు చేసిన సంగతి తెలిసిందే. ఆ మాటే నిజమవుతోంది. భగ్గుమంటోన్న ధరల కారణంగా పుతిన్ ప్రభుత్వానికి బిలియన్ డాలర్ల ఆదాయం సమకూరుతోందని అంతర్జాతీయ మీడియా కథనాలు వెల్లడించాయి (Russian oil).గురువారం సెనెట్ సాయుధ సేవల కమిటీ విచారణ సందర్భంగా యూఎస్ సెనెటర్ ఆంగస్ కింగ్ మాట్లాడుతూ.. ''ఈ యుద్ధంలో స్పష్టమైన విజయం పుతిన్, రష్యాదే. ఈ యుద్ధం మాస్కోకు ఊహించని లాభాలు తెచ్చిపెడుతోంది'' అని అన్నారు. యుద్ధం ప్రారంభమైన దగ్గరినుంచి 6 బిలియన్ డాలర్ల అదనపు ఆదాయాన్ని పొందిందన్న అంచనాలను ప్రస్తావించారు. అదేరోజు లెక్కన చూసుకుంటే దాదాపు 400 మిలియన్ డాలర్ల (దాదాపు రూ.3,700 కోట్లు) అదనపు ఆదాయాన్ని ఆర్జించిందన్నారు. పశ్చిమాసియాలో యుద్ధం వల్ల ప్రపంచం ఎదుర్కొంటోన్న భౌగోళిక రాజకీయ పరిణామాలపై పెంటగాన్ అధికారులను ఈ విచారణలో భాగంగా ప్రశ్నించారు.

## అడోబ్ సీఈఓ పదవి నుంచి వైదొలగనున్న శంతను నారాయణ్




అమెరికాకు చెందిన ప్రముఖ సాఫ్ట్‌వేర్ సంస్థ అడోబ్‌లో నాయకత్వ మార్పు జరగనుంది. దాదాపు రెండు దశాబ్దాలుగా చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్‌గా కొనసాగుతోన్న శంతను నారాయణ్ ఆ పదవి నుంచి దిగిపోనున్నారు. ఈ మేరకు కంపెనీ (Adobe) తాజాగా ఓ ప్రకటన చేసింది. తదుపరి సీఈఓ ఎంపిక పూర్తయిన తర్వాత శంతను ఆ బాధ్యతల నుంచి వైదొలగనున్నట్లు పేర్కొంది. అయితే, బోర్డు ఛైర్మన్‌గా ఆయన (Shantanu Narayen) కొనసాగుతారని తెలిపింది. అయితే, ఈ మార్పునకు గల కారణాన్ని మాత్రం కంపెనీ గానీ.. శంతను నారాయణ్ గానీ వెల్లడించలేదు. ''సీఈవో బాధ్యతల నుంచి మారాలనుకుంటున్న నా నిర్ణయాన్ని బోర్డుకు తెలియజేశాను. దానికి బోర్డు అంగీకరించింది. ఇది గుడ్‌బై ఎంతమాత్రం కాదు. బోర్డు ఛైర్మన్‌గా కంపెనీ కోసం శ్రమిస్తూనే ఉంటా'' అని ఉద్యోగులకు రాసిన మెయిల్‌లో శంతను పేర్కొన్నారు. మరోవైపు, అడోబ్ తదుపరి సీఈఓ ఎంపిక కోసం బోర్డు ప్రత్యేక కమిటీని ఏర్పాటుచేసింది.భారత్‌కు చెందిన 62 ఏళ్ల శంతను నారాయణ్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి బ్యాచిలర్ డిగ్రీ పూర్తి చేశారు. కాలిఫోర్నియా యూనివర్సిటీలో ఎంబీఏ చదివారు. తొలుత సిలికాన్ గ్రాఫిక్స్, యాపిల్‌లో కొంతకాలం పనిచేసిన ఆయన.. 1998లో అడోబ్‌లో జనరల్ మేనేజర్‌గా చేశారు. 2007లో కంపెనీ సీఈఓగా బాధ్యతలు అందుకున్నారు. ఆయన నాయకత్వంలో కంపెనీ రికార్డు రెవెన్యూను సాధించింది. క్రియేటివ్, డిజిటల్ మీడియా సాఫ్ట్‌వేర్‌లో ప్రత్యేక స్థానం సాధించింది. బిజినెస్ రంగంలో శంతను అందించిన సేవలకు గానూ.. భారత ప్రభుత్వం పద్మశ్రీ పురస్కారంతో సత్కరించింది.

## మరో డీల్ దిశగా భారత్‌అమెరికా

### .. యూఎస్ రాయబారి కీలక ప్రకటన

భారత్‌అమెరికాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్యం బలోపేతం దిశగా కీలక అడుగులు పడుతున్నాయి. ఇప్పటికే ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం ఫ్రేమ్‌వర్క్‌పై ఇరుదేశాల మధ్య అంగీకారం కుదరగా.. తాజాగా మరో ప్రకటన వెలువడింది. ఇరుదేశాల మధ్య త్వరలోనే క్రిటికల్ మినరల్స్ ఒప్పందం (US India Critical Minerals Deal) కుదరనున్నట్లు భారత్‌లోని అమెరికా రాయబారి సెర్గియో గోర్ (US Ambassador Sergio Gor) వెల్లడించారు. ఇండియా టుడే కాంక్లేవ్ 2026లో మాట్లాడుతూ ఈ విషయాన్ని చెప్పారు. ''భారత్‌అమెరికా ద్వైపాక్షిక సహకారానికి ముఖ్యమైన రంగాల్లో క్రిటికల్ మినరల్స్ కీలకమైనది. ఈ ఖనిజాల విశ్వసనీయ సరఫరా గొలుసులు ఆర్థిక వృద్ధికి, జాతీయభద్రతకు ఎంతో అవసరం. అధునాతన తయారీ, ఇంధన వ్యవస్థలు, సాంకేతికత అభివృద్ధి తదితర రంగాల్లో ఈ ఖనిజాల వినియోగం కోసం ఇరుదేశాల మధ్య అతిత్వరలోనే ఒప్పందం కుదరనుంది'' అని సెర్గియో గోర్ వెల్లడించారు.ఈసందర్భంగా భారత్, అమెరికాల మధ్య కుదిరిన మధ్యంతర వాణిజ్య ఒప్పందం (USIndia Trade Deal) అంశాన్ని కూడా అగ్రరాజ్య రాయబారి ప్రస్తావించారు. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, భారత ప్రధాని నరేంద్రమోదీ వ్యక్తిగత స్నేహం వల్ల ఈ ట్రేడ్ డీల్ సాధ్యమైందని తెలిపారు. ఏప్రిల్‌లో దీనిపై సంతకాలు జరగొచ్చని పేర్కొన్నారు. ఈ ఒప్పందంతో భారత తయారీరంగాలకు 30 ట్రిలియన్ డాలర్ల మేర మార్కెట్ అవకాశాలు లభించనున్నట్లు తెలుస్తోంది.

## యుద్ధ సంక్షోభం

# రూ. 19 లక్షల కోట్లు ధమాల్!



ప్రపంచవ్యాప్తంగా ఏ ఉపద్రం వచ్చినా, భౌగోళికంగా ఎలాంటి సంక్షోభం తలెత్తినా ముఖ్యంగా యుద్ధం వచ్చిందంటే ముందుగా ప్రభావితమయ్యేది దేశీయ స్టాక్ మార్కెట్లు. తాజాగా ఇరాన్‌పై అమెరికాఇజ్రాయెల్ సంయుక్త దాడులతో మధ్యప్రాచ్య అనిశ్చితి, హార్ముజ్ జలసంధి మూసివేత, చమురు సంక్షోభం భారత మార్కెట్లను తీవ్రంగా దెబ్బతీసింది. ఫలితంగా గత నాలుగేళ్లలో అత్యంత దారుణమైన వారంగా ఈ వారం నిలిచింది. ఈ దారుణ పతనంతో పెట్టుబడిదారులు దాదాపు రూ.19 లక్షల కోట్లు నష్టపోయారు. ఈ అనిశ్చితి ప్రపంచ మార్కెట్లను కూడా బలహీనపరిచిందని, కోలుకోవడానికి కొంత సమయం పట్టవచ్చంటున్నారు విశ్లేషకులు.

**75వేల దిగువకు సెన్సెక్స్, మార్కెట్ క్యాప్ నష్టం**

ఈ వారం వీకెండ్ శుక్రవారం రోజు సెన్సెక్స్ 1,442 పాయింట్లు కోల్పోయి 75వేల పాయింట్ల (74,592 పాయింట్ల వద్ద ముగిసింది)దిగువకు చేరింది. ఒక రోజులో దాదాపు రూ.9.8 లక్షల కోట్ల సందప తుడిచి పెట్టుకుపోయింది. ఫలితంగా రూ.19 లక్షల కోట్ల నష్టం వాటిల్లింది. మార్కెట్ వాల్యుయేషన్ రూ.430 లక్షల కోట్లకు చేరింది. FIIలు అమ్మకాల భారీగా కొనసాగుతున్నాయి. ఎల్ అండ్ టీ టాటా స్టీల్ , SBI, భారత్ ఎలక్ట్రానిక్స్ , మారుతి టాప్ లూజర్స్‌గా నిలిచాయి.

మునుపటి శుక్రవారం అంటే మార్చి 6న బీఎస్‌ఈ సెన్సెక్స్ 78,918 వద్ద ముగిసింది. అప్పటి మార్కెట్ వాల్యుయేషన్ రూ.449.35 లక్షల కోట్లుగా ఉంది.ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి, మార్కెట్లు మొత్తం రూ.25 లక్షల కోట్లను కోల్పోయాయి.

ఇదీ చదవండి: మోదీకి, యోగికి విజ్ఞప్తి : మహిళ సూసైడ్ వీడియో వైరల్

**నిఫ్టీ నష్టాలు ఇలా..**

ఇక నిఫ్టీ 468 పాయింట్లు క్షీణించి 23,170 పాయింట్ల వద్ద స్థిరపడింది. జనవరి 5న నమోదైన గరిష్ట స్థాయి 26,373 పాయింట్లు. అంటే 10 శాతం క్షీణించింది. భారత మార్కెట్లు చివరిసారిగా ఈ స్థాయిలో నష్టాలను చవిచూసింది 2022 జూన్‌లో మాత్రమే. బ్రెంట్ ముడిచమురు ధరలు బ్యారెల్‌కు 102 డాలర్లకు పెరగడం ఈ వారం పెట్టుబడిదారులకు ఒక పీడకల చెప్పవచ్చు.

ఇదీ చదవండి: మోజ్తాబా ఖమేనీని ఖతం చేస్తాం.. నెతన్యాహూ సంచలన వ్యాఖ్యలు

**యుద్ధం చమురు సంక్షోభం మార్కెట్లు**

ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధం ప్రపంచ మార్కెట్లపై తీవ్ర ప్రభావాన్ని చూపింది. చమురు సరఫరాపై ప్రభావం ముడిచమురు ధరలను అమాంతం పెరిగాయి. ఫిబ్రవరి 28న యుద్ధం ప్రారంభమైనప్పటి నుండి, మార్కెట్లు మొత్తం రూ.25 లక్షల కోట్లను కోల్పోయాయి. ప్రధాన ఆసియా మార్కెట్లలో, దక్షిణ కొరియా, జపాన్, చైనా , హాంకాంగ్‌ల సూచీలు దిగువన ముగిశాయి.

## రెండోసారి పెరగనున్న బెంజ్ కార్ల ధరలు



ప్రముఖ జర్మన్ లగ్జరీ కార్ల తయారీ సంస్థ.. మెర్సిడెస్‌బెంజ్ భారతదేశంలో విక్రయించే తమ వాహనాలపై 2 శాతం ధరల పెంపును ప్రకటించింది. కొత్త ధరలు ఏప్రిల్ 2026 నుంచి అమల్లోకి రానున్నట్లు సంస్థ ప్రకటించింది.2026 ప్రారంభమైన తరువాత బెంజ్ కంపెనీ తన వాహనాల ధరలను పెంచడం ఇది రెండో సారి. సంస్థ జనవరిలో కూడా ధరలను పెంచింది. ఇప్పుడు మరోమారు ధరలను పెంచనున్నట్లు ప్రకటించింది. ధరల పెరుగుదలకు ఫారెక్స్‌లో అస్థిరత మరియు వాహనాల తయారీలో పెరుగుతున్న ఇన్‌పుట్ ఖర్చులు కారణమని పేర్కొంది. ధరల పెరుగుదల Cక్లాస్, EQS, Eక్లాస్ LWB, Sక్లాస్, EQA, EQB, EQS, EQE, GLC, GLA, GLE, GLS, CLE క్యాబ్రియోలెట్ వంటి కార్ల మీద మాత్రమే కాకుండా కొత్తగా ప్రారంభించిన Vక్లాస్ వంటి మోడళ్లను కూడా ప్రభావితం చేస్తుంది. కొత్త ధరలు త్వరలోనే వెల్లడవుతాయి.

## ప్రయాణికులపై సర్‘ఛార్జ్’.. ఎయిరిండియా బాటలో మరిన్ని కంపెనీలు?

పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావం విమానయాన రంగాన్నీ తాకింది. ఇరాన్, అమెరికా-ఇజ్రాయెల్ మధ్య ఉద్రిక్తతల నేపథ్యంలో విమాన ఇంధన ధరలకు (ATF price) రెక్కలు రావడంతో విమానయాన సంస్థలు ప్రయాణికులపై ఆ భారాన్ని మోపేందుకు సిద్ధమవుతున్నాయి. ఇప్పటికే టాటా గ్రూప్‌నకు చెందిన ఎయిరిండియా సంస్థ టికెట్ ధరపై సర్‌ఛార్జీ విధిస్తుండగా.. మిగిలిన కంపెనీలూ అదే బాటలో పయనించనున్నాయి. ఇండిగో, స్పైస్‌జెట్, ఆకాశ ఎయిర్ వంటి సంస్థలు సర్‌ఛార్జీ వేసేందుకు సిద్ధమవుతున్నాయంటూ ‘ఎన్డీటీవీ ప్రాఫిట్’ తన కథనంలో పేర్కొంది. ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయెల్ దాడి అనంతరం చమురు ధరలకు రెక్కలు వచ్చిన సంగతి తెలిసిందే. విమానయాన సంస్థల నిర్వహణ వ్యయాల్లో ఇంధనం వాటానే 40% వరకు ఉంటుంది. ఈ నేపథ్యంలోనే టికెట్ ధరలపై ఎయిరిండియా సర్‌ఛార్జీని ప్రకటించింది. ఈ క్రమంలో మరి కొన్ని విమానయాన సంస్థలు దీనిపై చర్చలు జరుపుతున్నట్లు తెలిసింది. త్వరలోనే దీనిపై ఒక ప్రకటన రావొచ్చని సదరు కథనం పేర్కొంది. ఎంతమేర పెరిగేది? ఎప్పటి నుంచి పెరిగేదీ అన్న అంశాలపై త్వరలో స్పష్టత రానుంది. క్రూడాయిల్ ధరల పెరుగుదల వేళ ఇప్పటికే విమాన టికెట్ ధరలను ఆయా సంస్థలు పెంచేశాయి. సర్‌ఛార్జి రూపంలో దీనికి అదనపు భారం తోడుకానుంది. ..: మార్చి 12 నుంచి దేశీయ, అంతర్జాతీయ మార్గాల్లో టికెట్లపై ఇంధన సర్‌ఛార్జీ విధిస్తున్నట్లు ఎయిరిండియా - ఎయిరిండియా ఎక్స్‌ప్రెస్ సంస్థలు ఇటీవల ప్రకటించాయి. దేశీయ మార్గాలు, సార్క్ దేశాల గమ్యస్థానాలకు ప్రయాణించే విమాన టికెట్లపై రూ.399 చొప్పున ఈ ఛార్జీ విధిస్తారు. పశ్చిమాసియా విమాన టికెట్లపై 10 డాలర్లు విధిస్తారు. ఆఫ్రికా దేశాల టికెట్లపై 30-90 డాలర్లు, ఆగ్నేయాసియా విమానాలకు 20-60 డాలర్ల చొప్పున సర్‌ఛార్జీ పెంచనున్నారు. సింగపూర్ విమాన టికెట్లపై ప్రస్తుతం సర్‌ఛార్జీ లేకపోగా, ఇకపై వసూలు చేస్తారు. మార్చి 18 నుంచి ఐరోపా టికెట్లపై సర్‌ఛార్జ్ 25 డాలర్లు పెరిగి 125 డాలర్లకు, ఆస్ట్రేలియా- అమెరికా టికెట్లపై 50 డాలర్లు పెరిగి 200 డాలర్లకు చేరనుంది.



## కొత్త తరహా ప్రేమకథ... 'డెకాయిట్'




"ఈ మధ్యకాలంలో మనం ప్రేమకథలు చెప్పడం మానేశాం. థ్రిల్‌ని పంచే యాక్షన్‌ని మేళవించి చెప్పిన ఓ కొత్త తరహా ప్రేమకథా చిత్రమే 'డెకాయిట్'. అందరూ కుటుంబంతో కలిసి చూసేలా ఈ సినిమా ఉంటుంది'' అన్నారు అడివి శేష్. ఆయన కథానాయకుడిగా... షానియల్ డియో దర్శకత్వంలో రూపొందిన చిత్రమే 'డెకాయిట్'. మృణాల్ ఠాకూర్ కథానాయిక. అనురాగ్ కశ్యప్ కీలక పాత్రని పోషిస్తున్నారు. సుప్రియా యార్లగడ్డ నిర్మిస్తున్నారు. అన్నపూర్ణ స్టూడియోస్ సంస్థ సమర్పిస్తోంది. ఏప్రిల్ 10న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ సినిమా చిత్రీకరణ బుధవారంతో పూర్తయింది. ఈ సందర్భంగా చిత్ర బృందం హైదరాబాద్‌లో విలేకర్ల సమావేశం నిర్వహించింది.అడివి శేష్ మాట్లాడుతూ "విడిపోయిన ఇద్దరు ప్రేమికుల కథ ఇది. ఆ తర్వాత సాగిన ఆ ఇద్దరి ప్రయాణంలో తెలుసుకున్న వాస్తవాలు ఏమిటన్నది ఈ సినిమాలో ప్రత్యేకం. చుట్టూ గన్నులు, తూటాలు ఉన్నప్పుడు ఇద్దరి మధ్య భావోద్వేగం ఎలా ఉంటుందన్నది ఇందులో కొత్తగా ఉంటుంది. 149 రోజుల్లో తెలుగు, హిందీ భాషల్లో చిత్రీకరణని పూర్తి చేశాం. ఈ కథ రాయడానికే ఏడాదిపాటు సమయం తీసుకున్నాం. దోపిడీ నేపథ్యం ఈ కథలో ఓ భాగం. అందుకే 'డెకాయిట్' అనే పేరు పెట్టాం. కన్నెపిట్టరో... పాట పెట్టాలన్న ఆలోచన నిర్మాత సుప్రియదే. అది మంచి ఫలితాన్నిచ్చింది'' అన్నారు. నిర్మాత సుప్రియ యార్లగడ్డ మాట్లాడుతూ "ఈ సినిమా ఓ సుదీర్ఘమైన ప్రయాణం. దర్శకుడు షానియల్ డియోకి ఇది తొలి చిత్రం. అనురాగ్ కశ్యప్ తెలుగులో చేస్తున్న తొలి సినిమా. శేష్ చేస్తున్న తొలి ప్రేమకథ. ఇలా ఎన్నో ప్రత్యేకతలున్న ఈ చిత్రాన్ని వచ్చే నెలలోనే ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తుండడం ఆనందంగా ఉంది'' అన్నారు.నటుడు అనురాగ్ కశ్యప్ మాట్లాడుతూ "సుప్రియ నాకు రామ్‌గోపాల్ వర్మతో పనిచేస్తున్న రోజుల నుంచీ తెలుసు.



## ఏపీలో 'ఉస్తాద్ భగత్ సింగ్' బెనిఫిట్ షో.. టికెట్ ధర ఎంతంటే?

పవన్‌కల్యాణ్ (Pawan Kalyan) అభిమానులకు శుభవార్త. ఆయన కథానాయకుడిగా హరీశ్ శంకర్ దర్శకత్వంలో రూపొందిన యాక్షన్ ఎంటర్‌టైనర్ 'ఉస్తాద్ భగత్ సింగ్' (Ustaad bhagat singh). ఉగాది కానుకగా మార్చి 19న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ నేపథ్యంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం బెనిఫిట్ షోతో పాటు టికెట్ ధరలు (ustaad bhagat singh tickets release date) పెంచుకునేందుకు అనుమతి ఇస్తూ మెమో జారీ చేసింది.మార్చి 19న తెల్లవారుజామున 4-5గంటల మధ్యలో బెనిఫిట్ షో ప్రదర్శనకు అనుమతి ఇవ్వగా, దీని టికెట్ ధరను రూ.500గా (పన్నులతో కలిపి) నిర్ణయించారు. అలాగే పది రోజుల పాటు టికెట్ ధరలు పెంచుకునే వెసులుబాటు ఇచ్చింది. సింగిల్ స్క్రీన్‌లలో రూ.100, మల్టీప్లెక్స్‌లలో రూ.125 చొప్పున పెంచుకునే అవకాశమిచ్చింది. పెంచిన టికెట్ ధరలు (ustad bhagat singh ticket price) మార్చి 19 నుంచి మార్చి 28 వరకూ అమల్లో ఉంటాయి. గత కొంతకాలంగా అగ్ర కథానాయకుల చిత్రాలను స్పెషల్ ప్రీమియర్ పేరుతో ముందు రోజు రాత్రి ప్రదర్శిస్తున్నారు. ఇప్పటికే ఈ విషయంలో 'ధురంధర్2' రెండు అడుగుల ముందే ఉంది. 'ఉస్తాద్'కు మార్చి 19న బెనిఫిట్ షోకు అనుమతి ఇచ్చిన నేపథ్యంలో ముందు రోజు షో ఉంటుందా? లేదా? అన్న దానిపై స్పష్టత రావాల్సి ఉంది.ఇటీవల సెన్సార్ పూర్తి చేసుకున్న 'ఉస్తాద్ భగత్ సింగ్' ఎలాంటి కట్స్ లేకుండా యూ/ఏ సర్టిఫికెట్ వచ్చినట్లు చిత్ర బృందం ప్రకటించింది. ఇక ఈ మూవీ రన్ టైమ్ 2 గంటల 34 నిమిషాలుగా (Ustaad bhagat singh runtime) నిర్ణయించారు. శ్రీలీల, రాశీఖన్నా కథానాయికలుగా నటిస్తున్న ఈ చిత్రానికి దేవిశ్రీ ప్రసాద్ సంగీతం అందిస్తున్నారు.

# ఆశను కోల్పోవద్దు..

## విడాకుల తర్వాత హన్సిక మొదటి పోస్ట్

నటి హన్సిక తన భర్త నుంచి విడాకులు తీసుకున్న విషయం తెలిసిందే. నాలుగేళ్ల వివాహబంధానికి ముగింపు పలికారు (Hansika Divorce). విడాకుల అనంతరం ఆమె తాజాగా సోషల్ మీడియాలో ఓ పోస్ట్ పెట్టారు. పంజాబీ పదం 'చార్దీ కలా..' అని రాశారు. ఎప్పుడూ ఉత్సాహంతో ముందుకుసాగాలని.. ప్రతికూల పరిస్థితుల్లోనూ ఆశను కోల్పోవద్దని దీని అర్థం.

2022 డిసెంబర్‌లో సోహైల్-హన్సిక వివాహం చేసుకున్నారు. వీరి వివాహాన్ని 'లవ్ షాదీ డ్రామా' అనే పేరుతో డాక్యుమెంటరీ సిరీస్‌గా కూడా విడుదల చేశారు. గతేడాది ఆగస్టులో ఆమె సోషల్ మీడియాలో పెళ్లి ఫొటోలు డిలీట్ చేయడంతో విడాకుల రూమర్స్ మొదలయ్యాయి. మార్చి 11న వీరికి కోర్టు విడాకులు మంజూరుచేసింది.



## కొత్త సినిమాలకు ఊరట.. 90రోజుల నిబంధనపై సుప్రీంకోర్టు స్టే



దిల్లీ: సినిమా టికెట్ ధరల పెంపుపై ఇటీవల తెలంగాణ హైకోర్టు ఇచ్చిన మధ్యంతర ఉత్తర్వులను సుప్రీంకోర్టు (Supreme Court) తాత్కాలికంగా నిలిపివేసింది. టికెట్ రేట్లు పెంచాలంటే చట్టంలో ఉన్న నిబంధన ప్రకారం.. సినిమా విడుదలకు 90 రోజుల ముందే ప్రభుత్వం మెమో ఇవ్వాలని హైకోర్టు ఆదేశించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రముఖ చిత్ర నిర్మాణ సంస్థ మైత్రీ మూవీ మేకర్స్ సుప్రీంకోర్టులో పిటిషన్ వేసింది. దీనిపై శుక్రవారం విచారణ జరగ్గా జస్టిస్ జేకే మహేశ్వరి, జస్టిస్ ఏఎస్ చందూర్కర్‌లతో కూడిన ధర్మాసనం హైకోర్టు ఉత్తర్వులపై స్టే విధించింది. ప్రస్తుతానికి టికెట్ ధరల పెంపుపై ఎప్పుడూ అనుసరిస్తున్న విధానాన్నే కొనసాగించాలని సూచించింది. దీంతో త్వరలో విడుదల కాబోయే చిత్రాలకు ఊరట లభించింది. ప్రీమియర్స్‌తో పాటు, టికెట్ ధరలను పెంచుకునేందుకు వెసులుబాటు లభించింది.

ఇదీ జరిగింది..

సంక్రాంతి సందర్భంగా విడుదలైన తెలుగు సినిమాల టికెట్ ధరల పెంచుతూ (ticket price hike in telangana) రాష్ట్ర హోంశాఖ ముఖ్యకార్యదర్శి మెమో జారీ చేశారు. దీనిపై హైకోర్టులో పిటిషన్ దాఖలు కాగా, న్యాయస్థానం ఆగ్రహం వ్యక్తం చేసింది. భవిష్యత్తులో టికెట్ ధరలను పెంచరాదంటూ స్పష్టమైన ఆదేశాలున్నప్పటికీ 'మన శంకరవరప్రసాద్ గారు' సినిమా విషయంలో ఎలా అనుమతించారని నిలదీసింది. 'రాజాసాబ్'తో పాటు ఈ సినిమాకూ ఒకే రోజు టికెట్ ధరల పెంపునకు అనుమతిస్తూ మెమో జారీ చేసినప్పుడు.. ఆ విషయాన్ని కోర్టు దృష్టికి ఎందుకు తీసుకురాలేదని ప్రశ్నించింది. టికెట్ ధరలు పెంచొద్దని హైకోర్టు ఉత్తర్వులు వెలువరించిన విషయం తెలిసీ ఈ నెల 10న పబ్లిక్ డొమైన్‌లో 'ధరల పెంపు మెమో'ను పెట్టడంపై సుమోటో కోర్టు ధిక్కరణగా పరిగణనలోకి తీసుకుంటున్నట్లు తెలిపింది. ఇకపై టికెట్ ధరల పెంపు నిర్ణయాన్ని సినిమా విడుదలకు 90 రోజుల ముందే వెల్లడించాలని మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. హైకోర్టు ఆదేశాలపై మైత్రీ మూవీ మేకర్స్ సుప్రీంకోర్టును ఆశ్రయించగా, ఆ ఉత్తర్వులపై సర్వోన్నత న్యాయస్థానం స్టే విధించింది.

## పెళ్లికి ముందు ఆ విషయం గురించే చర్చించుకునేవాళ్లం: అల్లు శిరీష్



తన పిల్లలు ఇంట్లో తెలుగులో మాట్లాడేలా పెంచుతానంటున్నారు అల్లు శిరీష్ (Allu Sirish). తన ప్రియురాలితో పెళ్లిపీటలెక్కిన ఆయన తాజాగా ఆంగ్ల మీడియాతో ప్రేమ ప్రయాణాన్ని గుర్తుచేసుకున్నారు. నయనికకు సెన్స్ ఆఫ్ హ్యూమర్ ఎక్కువని చెప్పారు.

"మేం ప్రేమలో ఉన్నప్పుడు ఎప్పుడూ పెళ్లి గురించే మాట్లాడుకునేవాళ్లం. మాకు పుట్టే పిల్లలు ఇంట్లో తెలుగులోనే మాట్లాడాలని నా కోరిక. దాని గురించి కూడా మేం చర్చించుకున్నాం. నయనిక సెన్స్ ఆఫ్ హ్యూమర్ అంటే నాకు ఇష్టం. అలాగే ఏ విషయమైనా నచ్చకపోతే నచ్చలేదని ముక్కుసూటిగా చెబుతుంది. నా సినిమాల్లో నచ్చిన విషయాలను పంచుకుంటుంది. ఇండస్ట్రీకి సంబంధం లేని వ్యక్తి (Nayanika Reddy) అయినప్పటికీ నయనిక నా వర్క్‌ను పూర్తిగా అర్థం చేసుకోగలదు'' అని శిరీష్ చెప్పారు.

ఇక తన డేటింగ్ రోజుల గురించి చెబుతూ కాఫీ షాప్‌నకు వెళ్లిన తర్వాత వారి ప్రేమ విషయం బయటకు వచ్చిందని చెప్పారు. "మేం కాఫీ షాప్‌నకు వెళ్లిన విషయం మా అత్తయ్యకు (చిరంజీవి భార్య సురేఖ) తెలిసింది. మమ్మల్ని చూసినవాళ్లు ఆమెకు ఫోన్ చేసి అడిగారు. అలా మా ప్రేమ విషయం ఇంట్లో తెలిసింది. దీంతో నేను కూడా నయనికపై ఉన్న ప్రేమను ఇంట్లో చెప్పా.. అందరూ అంగీకరించడంతో మేం ఒక్కటయ్యాం. నయనికను వాళ్ల నాన్న ఎలా చూసుకున్నాడో నేను కూడా అలానే చూసుకోవాలనుకుంటున్నా'' అని తెలిపారు.

## ఎంజీఆర్‌పై వ్యాఖ్యలు.. క్షమాపణలు చెప్పిన రాజేంద్రప్రసాద్



సీనియర్ నటుడు రాజేంద్రప్రసాద్ క్షమాపణలు చెప్పారు. తమిళ లెజెండరీ నటుడు ఎంజీఆర్‌ను ప్రస్తావిస్తూ తాను చేసిన వ్యాఖ్యలు పొరపాటేనని అన్నారు. అయితే, అవి ఉద్దేశ పూర్వకంగా చేసినవి కావని, అనుకోకుండా దొర్లాయని విచారం వ్యక్తం చేశారు. ఇటీవల ఓ కార్యక్రమంలో తెలుగు నటుడు కాంతారావును ప్రశంసించే క్రమంలో ఎంజీఆర్‌పై రాజేంద్రప్రసాద్ కామెంట్స్ (rajendra prasad comments on mgr) చేశారు. కాంతారావును చూసి ఎంజీఆర్ భయపడేవారని అన్నారు. ఈ కామెంట్స్ సర్వత్రా చర్చనీయాంశంగా మారాయి. ఈ క్రమంలో తమిళంలో క్షమాపణలు చెబుతూ రాజేంద్రప్రసాద్ వీడియోను విడుదల చేశారు.

"తమిళ సినీ ప్రేక్షకుల మాదిరిగానే నేనూ ఎంజీఆర్‌ను దైవంలా భావిస్తా. తెలుగు నటుడు కాంతారావును ప్రశంసించే క్రమంలో నోరుజారాను. అయితే, అవి ఉద్దేశ పూర్వకంగా చేసినవి కావు. కొందరు ఈ అంశాన్ని పెద్దది చేశారు. ఆయనపై వ్యాఖ్యలు చేసేంత ధైర్యం నాకుందా? నేను చెన్నై ఫిల్మ్ ఇనిస్టిట్యూట్‌లో ఉండగా, ఆయన సీఎంగా ఉన్నారు. మేము నటిస్తుంటే వచ్చి చూసేవారు. అలాంటి గొప్ప వ్యక్తి గురించి నేను మాట్లాడగలనా? నా వ్యాఖ్యలు ఎవరినైనా బాధించి ఉంటే క్షమించండి. భవిష్యత్‌లో ఇలాంటి వ్యాఖ్యలు ఎప్పుడూ చేయను'' రాజేంద్రప్రసాద్

**తమిళ నటులు విశాల్, నాజర్‌లు రాజేంద్రప్రసాద్ వ్యాఖ్యలపై అసహనం వ్యక్తం చేశారు. ఎంజీఆర్ గురించి చౌకబారు పోలికతో రాజేంద్ర ప్రసాద్ మాట్లాడటం దిగ్భ్రాంతిని కలిగించిందన్నారు. ఆయన చేసిన వ్యాఖ్యలు ప్రతి తమిళుడి మనసును నొచ్చుకునేలా చేశాయన్నారు. రాజేంద్ర ప్రసాద్ క్షమాపణ చెప్పాలని నటుడు విశాల్ డిమాండ్ చేశారు. దీంతో రాజేంద్రప్రసాద్ ఎంజీఆర్ అభిమానులకు క్షమాపణ చెప్పారు.**

## తండ్రిలా హీరో అవ్వాలనుకుంటున్న అయాన్.. వేషాలేస్తానని..



అల్లు కుటుంబం నుంచి మరొకరు ఇండస్ట్రీలో ఎంట్రీ ఇచ్చేందుకు సిద్ధమవుతున్నారు. ఆ ఒక్కరు మరెవరో కాదు, ఐకాన్ స్టార్ అల్లు అర్జున్ కుమారుడు అయాన్. ఇప్పటికే తన మాటలు, ప్రవర్తనతో సోషల్ మీడియాలో చాలా పాపులర్ అయిపోయాడు. ఈ మధ్యే మార్షల్ ఆర్ట్స్ కూడా నేర్చుకుంటున్నాడు. అయితే తను కూడా హీరో అవుతానంటున్నాడట!

**వేషాలు వేస్తున్నాడు**

ఈ విషయాన్ని స్వయంగా బన్నీ తండ్రి, నిర్మాత అల్లు అరవింద్ వెల్లడించాడు. అల్లు సినిమాస్ ప్రారంభోత్సవ వేడుకలో అరవింద్ మాట్లాడుతూ.. మా నాన్న, నేను, బన్నీయే కాదు.. వాళ్లబ్బాయి అయాన్ కూడా ఈ ఇండస్ట్రీలోనే ఉంటాడు. ఆల్‌రెడీ వేషాలు వేస్తానని ఇంట్లో వేషాలు వేస్తున్నాడు.

**ఎంట్రీ ఎప్పుడో?**

మా నాలుగు జనరేషన్స్ ఈ ఇండస్ట్రీపైనే ఉన్నాయి. అలాంటి చిత్రపరిశ్రమకు ఏదైనా తిరిగివ్వాలన్న సంకల్పంలో నుంచి పుట్టిందే అల్లు సినిమాస్ అని పేర్కొన్నాడు. మరి అయాన్ బాలనటుడిగా వెండితెరపై ఎంట్రీ ఇస్తాడా? లేదా పెరిగి పెద్దయ్యాక నేరుగా హీరోగా పరిచయమవుతాడా? చూడాలి!

## బీసీసీఐ వీడియో అనలిస్టుపై నిషేధం



రంజీ ట్రోఫీ మ్యాచ్‌లో ఫిక్సింగ్ చేసేందుకు ఆటగాడిని ప్రోత్సహించిన బీసీసీఐ వీడియో అనలిస్ట్‌పై యాంటీ కరప్షన్ యూనిట్ చర్య తీసుకుంది. ఆంధ్ర క్రికెట్ జట్టు వీడియో అనలిస్ట్ రాజా రెడ్డిపై నిషేధం విధిస్తున్నట్లు బోర్డు అంబుడ్స్‌మన్ ప్రకటించాడు.

రెండేళ్ల క్రితం జరిగిన ఈ ఘటనపై బోర్డు విచారణ పూర్తి చేసింది. 2023-24 సీజన్‌లో భాగంగా ఇండోర్‌లో మధ్యప్రదేశ్‌తో జరిగిన మ్యాచ్ సందర్భంగా ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ మ్యాచ్‌లో ఆంధ్ర ఆటగాడు గిరినాథ్ రెడ్డిని ఫిక్సింగ్ చేసేందుకు రాజారెడ్డి ప్రోత్సహించాడు. దాంతో ఈ విషయాన్ని అతను వెంటనే టీమ్ మేనేజర్ జుగల్ కిషోర్‌కు తెలియజేశాడు. అనంతరం దీనిపై రాజారెడ్డి వాట్సప్ తదితర సాక్ష్యాలను పరిగణలోకి తీసుకుంటా విచారణ చేపట్టిన యాంటీ కరప్షన్ యూనిట్ తమ నివేదికను అందించింది.

## 'నా చిన్ని తమ్ముడు.. ఇకపై ఆమెకు మాత్రమే సొంతం'



భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండుల్కర్ కుటుంబం ఆనందంలో మునిగితేలుతోంది. కొత్త కోడలి రాకతో పరివారంలో సందడి నెలకొంది. ఈ క్రమంలో సచిన్ కుమార్తె సారా టెండుల్కర్ తమ్ముడు అర్జున్ టెండుల్కర్ మరదలు సానియా చందోక్‌లను ఉద్దేశిస్తూ పెట్టిన పోస్టు సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.సానియా పాపిట్లో అర్జున్ తిలకం దిద్దుతున్న ఫొటోను పంచుకున్న సారా.. ''నా చిన్ని తమ్ముడు.. ఇకపై సానియాకే సొంతం. ఈ విశ్వం మీపై అంతులేని ప్రేమ, ఆశీర్వచనాలు కురిపించాలి. మీ హృదయం కోరుకున్న ప్రతి ఒక్కటి మీకు దక్కాలి. మీకు ఎవరి దిష్టి తగలకూడదు. మీ ఇద్దరిని నేను ఎంతగానో ప్రేమిస్తున్నాను. నా జీవితంలోని అత్యంత సంతోషకరమైన రోజు మీ పెళ్లి రోజే అని చెప్పడంలో సందేహంలేదు'' అని తమ్ముడు, మరదలిపై ప్రేమను కురిపించింది. తనకు సోదరిలేని లోటు తీర్చేలా సానియాను ఇచ్చినందుకు అర్జున్‌కు ఈ సందర్భంగా సారా ధన్యవాదాలు కూడా తెలిపింది.

కాగా సచిన్ అంజలి దంపతుల ఏకైక కుమారుడు అర్జున్ టెండుల్కర్ వివాహం మార్చి 5న సానియా చందోక్‌తో జరిగిన సంగతి తెలిసిందే. ముంబైలో జరిగిన ఈ వేడుకకు భారత క్రికెట్ దిగ్గజాలు మహేంద్ర సింగ్ ధోని, గౌతం గంభీర్, యువరాజ్ సింగ్, హర్భజన్ సింగ్ తదితరులు సతీసమేతంగా తరలివచ్చారు. ముకేశ్ అంబానీ కుటుంబం కూడా వచ్చి నూతన వధూవరులను ఆశీర్వదించింది. ఇదిలా ఉంటే.. తమ్ముడి పెళ్లిలో సారా కుందనపు బొమ్మలా మెరిసిపోయింది. సంగీత్, మెహందీ వేడుకలో సంప్రదాయ దుస్తుల్లో సారా టెండుల్కర్ మరింత అందంగా కనిపించింది. ఇక అర్జున్ సానియా సంగీత్ ఫొటోలను షేర్ చేస్తూ.. వారి పట్ల మరోసారి సారా ప్రేమ చూపగా.. సానియా ఇందుకు.. ''ధన్యవాదాలు.. లవ్ యూ సోదరి'' అంటూ జవాబు ఇచ్చింది. కాగా ముంబైకి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త రవి ఘాయ్ మనుమరాలు సానియా. ఆమె కూడా ఎంటర్‌ప్రెన్యూర్‌గా రాణిస్తోంది.

## ఈ కప్పు మాది కాదు.. మనందరిదీ సూర్యకుమార్ యాదవ్



టీమ్ఇండియా (Team India) టీ20 కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్ (Suryakumar Yadav).. భారత్ టీ20 ప్రపంచకప్ గెలిచిన నేపథ్యంలో ఫ్యాన్స్‌కు కృతజ్ఞతలు తెలిపాడు. దీనికి సంబంధించి బీసీసీఐ (BCCI) ఓ వీడియోను పోస్ట్ చేసింది. 'డియర్ టీమ్ఇండియా ఫ్యాన్స్ మీ అందరికీ హృదయ పూర్వక కృతజ్ఞతలు. మీ మద్దతు, దీవెనల వల్లే మేం ఇది సాధించాం. ఈ వరల్డ్ కప్ ట్రోఫీ కేవలం మా విజయం మాత్రమే కాదు. యావత్ భారత దేశ విజయం' అని సూర్యకుమార్ యాదవ్ అన్నాడు. 'ఈ కప్పు.. చేతిలో బ్యాట్, బంతి పట్టుకుని భవిష్యత్తును ఊహించుకుంటూ.. కలలుకంటున్న చిన్నారులది. ఈ విజయం స్టేడియాల్లో పోటెత్తిన అభిమానులది. ఈ విజయం మాకు మద్దతు తెలిపిన ఫ్యాన్స్ అందరిదీ. మీ ప్రేమ, ప్రార్థనలు ఈ కప్పును తిరిగి గెలిచే శక్తిని మాకు ప్రసాదించాయి. ఇండియాలో క్రికెట్ అంటే కేవలం ఆట కాదు. అదో ఎమోషన్. ఈ విజయం మీ అందరికీ చెందుతుంది' అని సూర్యకుమార్ యాదవ్ అన్నాడు.

'తర్వాతి లక్ష్యం అదే..'

టీమ్ఇండియా తర్వాతి లక్ష్యం 2028 ఒలింపిక్స్‌లో గోల్డ్ మెడల్ సాధించడమే అని సూర్యకుమార్ యాదవ్ వెల్లడించాడు. 'ఒలింపిక్స్‌లో బంగారు పతకం సాధించడమే టీమ్ఇండియా లక్ష్యం. అలాగే అదే సంవత్సరం జరగనున్న టీ20 వరల్డ్‌కప్‌లోనూ విజేతగా నిలవడం మరొక టార్గెట్' అని సూర్యకుమార్ వివరించాడు.జట్టుగా ఆడాం'

టీ20 ప్రపంచకప్‌లో భారత ఆటగాళ్లు వ్యక్తిగత మైలురాళ్ల కోసం కాకుండా, టీమ్ విజయంపై దృష్టి పెట్టారని సూర్యకుమార్ యాదవ్ పేర్కొన్నాడు. 'మీరు గమనించినట్లయితే, సెమీ ఫైనల్స్ వరకు అత్యధిక పరుగులు చేసిన, ఎక్కువ వికెట్లు సాధించిన ఆటగాళ్ల జాబితాలో భారత క్రికెటర్లెవరూ లేరు. అయినా మేం విజయం సాధించాం. ఇదంతా జట్టుగా ఆడటం వల్లే సాధ్యమైంది. . గత 18 నెలలుగా మేం ఈ దృక్పథంతో ముందుకు సాగుతున్నాం' అని సూర్యకుమార్ యాదవ్ వివరించాడు.

# ఐపీఎల్‌కు ఇబ్బందులు తప్పవా?




టీ20 ప్రపంచకప్ కోసం భారత్‌కు వచ్చిన కొన్ని జట్లు స్వదేశం చేరడానికి చాలా ఇబ్బందిపడ్డాయి. పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు తీవ్రం కావడంతో వెస్టిండీస్, దక్షిణాఫ్రికా ఆటగాళ్లు చాలా రోజులు కోల్‌కతాలో చిక్కుకుపోయారు. గురువారానికి కానీ అందరూ స్వదేశాలకు వెళ్లలేకపోయారు. డారెన్ సామి (వెస్టిండీస్), డికాక్ (దక్షిణాఫ్రికా) వంటి ఆటగాళ్లు భారత్‌లో చిక్కుకుపోవడంపై తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఇంగ్లాండ్ జట్టును ముందు పంపి.. ఆ తర్వాత వెస్టిండీస్, దక్షిణాఫ్రికా ఆటగాళ్లను పంపడంపై ఐసీసీ విమర్శలు ఎదుర్కొంది. ఇరాన్‌ఇజ్రాయెల్ యుద్ధం కొనసాగుతుండడంతో ఇప్పుడు 2026 ఐపీఎల్‌కూ ఇబ్బందులు తప్పకపోవచ్చన్న అనుమానాలు వ్యక్తమవుతున్నాయి. శ్రీలంక, అఫ్ఘానిస్థాన్ మధ్య ఈ నెల యూఏఈలో జరగాల్సిన పరిమిత ఓవర్ల సిరీస్ ఇప్పటికే వాయిదా పడింది. కీలక వాయు మార్గాలు మూసివేతతో ఐపీఎల్ కోసం విదేశీ ఆటగాళ్ల రాక కష్టమవుతుందని భావిస్తున్నారు. దుబాయ్, దోహా వంటి కీలక రవాణా కేంద్రాల్లో విమానాల రాకపోకలపై ఆంక్షలు ఉన్నాయి. ఈ నెల 28న ఐపీఎల్ మొదలు కానుంది. సమయానికి విదేశీ క్రికెటర్లను రప్పించడంపై పలు ఫ్రాంఛైజీల అధికారులు ఆందోళన వ్యక్తం చేశారు. ముఖ్యంగా దక్షిణాఫ్రికా, విండీస్ ఆటగాళ్లు సమయానికి రావడంపై అనిశ్చితి నెలకొంది. కొన్ని ఫ్రాంఛైజీలు మాత్రం ఆశాభావంతో ఉన్నాయి. అకీల్ హోసిన్ (వెస్టిండీస్), బ్రెవిస్ (దక్షిణాఫ్రికా)లు అనుకున్న సమయానికి జట్టుతో కలుస్తారని భావిస్తున్నట్లు చెన్నై సూపర్‌కింగ్స్ ముఖ్య కార్యనిర్వహణ అధికారి కాశీ విశ్వనాథన్ చెప్పాడు. అయితే విమాన ఛార్జీలు పెరగడంతో ఫ్రాంఛైజీలపై భారం పెరగనుంది. మరోవైపు వంట గ్యాస్ కొరత ఐపీఎల్ జట్లకు ఆతిథ్యమిచ్చే హోటల్స్‌కు సవాలు విసురుతోంది.

షెడ్యూలు ప్రకారం ఐపీఎల్‌ను ఆరంభించాలనుకుంటున్న బీసీసీఐ.. పరిస్థితిని పర్యవేక్షిస్తోంది. బోర్డు తాజాగా తొలి 20 ఐపీఎల్ మ్యాచ్‌లకు మాత్రమే షెడ్యూలును ప్రకటించింది. మిగతా మ్యాచ్‌ల తేదీలను వెల్లడించలేదు. రాష్ట్రాల ఎన్నికలు, అంతర్జాతీయ పరిస్థితులను దృష్టిలో ఉంచుకుని మిగతా షెడ్యూలును రూపొందించే పనిలో ఉంది. ఈ నెల 28న సొంతగడ్డపై సన్‌రైజర్స్ హైదరాబాద్‌తో మ్యాచ్‌తో డిఫెండింగ్ ఛాంపియన్ రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు టైటిల్ వేటను ఆరంభిస్తుంది. ఆ తర్వాత రోజు వాంఖడే స్టేడియంలో ముంబయి ఇండియన్స్, కోల్‌కతా నైట్‌రైడర్స్ తలపడతాయి. తమిళనాడు, అసోం, పశ్చిమ బెంగాల్ ఎన్నికల తేదీలు ప్రకటించాక ఐపీఎల్ పూర్తి షెడ్యూలును ఖరారు చేస్తారు. టోర్నీని వాయిదా వేయొచ్చనే ఊహాగానాలు కూడా వచ్చాయి. కానీ వాటిని బీసీసీఐ కొట్టిపారేసింది.

**ఐపీఎల్ షెడ్యూలు ప్రకారమే జరుగుతుందని, సవాళ్లను ఎదుర్కోవడానికి బోర్డు సిద్ధంగా ఉందని ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా అన్నాడు.**

# పాకిస్తాన్ ప్లేయర్ వింత రనౌట్.. క్రికెట్ చరిత్రలోనే!




ఢాకా వేదికగా బంగ్లాదేశ్‌తో జరుగుతున్న రెండో వన్డేలో పాకిస్తాన్ స్టార్ ప్లేయర్ సల్మాన్ అలీ అఘా వివాదస్పద రీతిలో రనౌటయ్యాడు. అతడు ఔటైన తీరు ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో తీవ్ర చర్చనీయాంశమైంది. ఈ మ్యాచ్‌లో టాస్ ఓడి తొలుత బ్యాటింగ్‌కు దిగిన పాకిస్తాన్‌కు ఓపెనర్లు మాజ్ సదాకత్(75), ఫర్హాన్(31) మంచి ఆరంభం ఇచ్చారు.ఆ తర్వాత పాక్ వెంటవెంటే మూడు వికెట్లు కోల్పోయి బ్యాక్‌ఫుట్‌లోకి వెళ్లింది. ఈ క్రమంలో సీనియర్ బ్యాటర్లు సల్మాన్ అలీ అఘా(64), మహ్మద్ రిజ్వాన్(44) నిలకడగా ఆడి తమ జట్టును భారీ స్కోర్ దిశగా నడిపించారు. అయితే పాక్ ఇన్నింగ్స్ 39 ఓవర్ వేసిన మోహది హసన్ మిరాజ్ బౌలింగ్‌లో సల్మాన్ అలీ ఊహించని విధంగా ఔటయ్యాడు.

### ఏమి జరిగిందంటే?

ఆ ఓవర్‌లో మెహదీ వేసిన నాలుగో బంతిని మహమ్మద్ రిజ్వాన్ స్ట్రెయిట్ షాట్ ఆడాడు. ఆ బంతి నాన్‌స్ట్రైకర్ ఎండ్‌లో ఉన్న సల్మాన్ అలీ ఆఘా బ్యాట్‌కు తగిలింది. ఆ సమయంలోనే బౌలర్ మిరాజ్, సల్మాన్ ఒకరినొకరు ఢీకొన్నారు. అయితే బంతి 'డెడ్' అయిందని భావించిన సల్మాన్, దానిని చేత్తో తీసి బౌలర్‌కు ఇవ్వబోయాడు. కానీ అదే సమయంలో బంతిని అందుకున్న మిరాజ్ స్టంప్స్‌ను గిరాటేశాడు.వెంటనే రనౌట్‌కు అప్పీల్ చేయగా ఫీల్డ్ అంపైర్‌లు థర్డ్ అంపైర్‌కు రిఫర్ చేశారు. స్టంప్స్ కిందపడే సమయానికి సల్మాన్ క్రీజు బయట ఉండడంతో థర్డ్ అంపైర్ ఔట్‌గా ప్రకటించాడు. సల్మాన్ అలీ తీవ్ర ఆగ్రహానికి లోనయ్యాడు. గ్రౌండ్‌లోనే తన గ్లౌవ్స్, హెల్మెట్‌ను నేలకేసి కొట్టాడు. అంతేకాకుండా బంగ్లా కెప్టెన్ మిరాజ్‌తో పాటు వికెట్ కీపర్ లిట్టన్ దాస్‌తో సల్మాన్ వాగ్వాదానికి దిగాడు. అంపైర్‌లు జోక్యంతో చేసుకోవడంతో సల్మాన్ నిరాశతో మైదానాన్ని వీడాడు. ఇందుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరలవుతోంది.

### రూల్స్ ఏమి చెబుతున్నాయి?

బంతి లైవ్‌లో ఉన్నప్పుడు బ్యాటర్ బంతిని బ్యాట్‌తో కానీ చేతితో కానీ టచ్ చేయకూడదు. ఫీల్డర్ అనుమతి లేకుండా బ్యాటర్ కావాలని బంతిని తాకినా లేదా ఫీల్డర్‌ను అడ్డుకున్నా 'అబ్‌స్ట్రాకింగ్ ది ఫీల్డ్' గా పరిగణిస్తారు. ఒకవేళ మిరాజ్ స్టంప్స్ పడగొట్టకుండా.. 'అబ్‌స్ట్రాకింగ్ ది ఫీల్డ్' అప్పీల్ చేసినా సల్మాన్ ఔటయ్యే వాడు. ఎందుకంటే అప్పటికే సల్మాన్ క్రీజుకు సుమారు ఒక అడుగు దూరంలో ఉండి, బంతిని బౌలర్‌కు అందించడానికి ప్రయత్నించాడు. ఈ మ్యాచ్‌లో మొదట బ్యాటింగ్ చేసిన పాకిస్తాన్ 47.3 ఓవర్లలో 274 పరుగులకు ఆలౌటైంది.

# ఆ విషయం ధోనికి చెప్పగలరా? : సీఎస్‌కే మాజీ క్రికెటర్




ఐపీఎల్ 2026 ఎడిషన్‌కు మరో రెండు వారాలు ఉంది. ఎంఎస్ ధోని ఏ పాత్ర పోషిస్తాడనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. చెన్నై సూపర్ కింగ్స్ తన తొలి మ్యాచ్‌లో మార్చి 30న రాజస్థాన్ రాయల్స్‌తో తలపడనుంది. ఇప్పటికే సీఎస్‌కే యువ క్రికెటర్లు సాధనను మొదలుపెట్టారు. ధోని కూడా ప్రాక్టీస్ చేసిన వీడియోలను సోషల్ మీడియాలో చూశాం. ఈ క్రమంలో సీఎస్‌కే మాజీ ఆటగాడు సుబ్రమణియన్ బద్రినాథ్ స్పందిస్తూ.. ధోని పాత్ర గురించి మేనేజ్‌మెంట్ ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో అనేది ఆసక్తికరంగా ఉందని తెలిపాడు."ధోని అన్ని మ్యాచులను ఆడేందుకు సిద్ధంగా ఉన్నాడని సీఈవో చెప్పడం అడ్మినిస్ట్రేటివ్ నిర్ణయమో కాదో తెలియదు. క్రికెట్‌పరంగా ఏం నిర్ణయం తీసుకున్నా మద్దతు ఇస్తామన్నారు. ధోని వద్దకు ప్రధాన కోచ్ స్టీఫెన్ ఫ్లెమింగ్ వెళ్లి .. నువ్వు ఇంపాక్ట్ ప్లేయర్‌గా ఆడాలి లేదా ఈ మ్యాచ్‌లో నిన్ను పక్కన పెడుతున్నాం అని చెప్పగలడా? అలాంటి అవకాశం లేదని భావిస్తున్నా. అది సాధ్యం కూడా కాదు. ఫ్లెమింగ్ మాత్రమే కాదు సీఎస్‌కేలో ఎవరూ అలా చెప్పరు. కాబట్టి, ధోని ఈ సీజన్‌లోని అన్ని మ్యాచులనూ ఆడతాడని అనుకోవచ్చు. ధోని కూడా మంచి ఫిట్‌గా ఉన్నాడు. ఐపీఎల్‌లో ఆడేందుకు ఆసక్తిగా ఎదురు చూస్తున్నాడు. అయితే, ఎలాంటి పాత్ర పోషిస్తాడనేది ఇప్పుడు అందరిలోనూ ఆసక్తి కలిగిస్తోన్న అంశం" అని బద్రినాథ్ వెల్లడించాడు.

**ఈసారి ఆర్సీబీని ఓడించగలదు..**

"రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు 18 ఏళ్లలో ఒకే ఒక్క కప్‌ను మాత్రమే సాధించింది. సీఎస్‌కే మాత్రం ఐదు టైటిళ్లను సొంతం చేసుకుంది. కాబట్టి, ఇరు జట్ల మధ్య 'పోటీ' ఉందని అనుకోను. ఇటీవల మ్యాచుల్లో మాత్రం సీఎస్‌కేపై ఆర్సీబీ విజయాలు సాధించింది. చిన్నస్వామి స్టేడియంలో చెన్నై ఓడింది. అయితే, సీఎస్‌కే తన సామర్థ్యం మేరకు అత్యుత్తమ క్రికెట్ ఆడలేదని చెప్పగలను. అందుకే, ఈ సీజన్‌లో ఇరు జట్ల మధ్య జరగబోయే మ్యాచ్ కోసం ఆసక్తిగా ఎదురు చూస్తున్నా" అని బద్రినాథ్ తెలిపాడు. ఆర్సీబీతో ఏప్రిల్ 5న బెంగళూరు వేదికగా సీఎస్‌కే తలపడుతోంది.